02.09.2026
బుధవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 112
పేజీలు : 08 | వెల: రూ.5



# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

## టెర్రరిజాన్ని తుడిచిపెట్టేయాలి

- వ్యవస్థను సమూలంగా కూల్చివేయాలి
- ఎస్‌సిఓ సదస్సులో పాక్ ప్రధానికి మోదీ చురకలు
- షాంఘై సహకార సంస్థ 26 వ శిఖరాగ్ర సదస్సు
- చైనా, రష్యా అధ్యక్షులు సహా దేశాధినేతలు హాజరు



**టెహ్రాన్, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్యూస్**

ఉగ్రవాదంపై పోరాటంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, ఆర్థిక సహకారం, రిక్రూట్‌మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా దాని మొత్తం వ్యవస్థను సమూలంగా తుడిచిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కేక్ వేదికగా జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు.ఈ ఈ

2లో..

## విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు

- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెల్లడి
- నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే నిర్ణయం

2లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్‌ఊస్**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది జులై నెలలో ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని నడ్డా పేర్కొన్నారు.

## ఎన్ని అడ్డంకులొచ్చినా నా ఆశయాన్ని ఆపలేరు

- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- వైకాపా హయాంలో రాష్ట్రానికి నష్టం
- కూటమి రాష్ట్రాన్ని గాడిన పెడుతోంది
- స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో వైకాపా
- డీఎస్సీపై 350 కేసులు వేసి అడ్డుకున్నారు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- దీపం కింద మూడు ఉచిత సిలిండర్లు
- దేశంలోనే అత్యధిక పింఛన్లు ఏపీలోనే
- రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి



**మొగల్తూరు, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్యూస్** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఏర్పాటుచేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు.

7లో..

"ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

**వైకాపా నేతలకు ఓటమి భయం పట్టుకుంది**

స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించనున్నట్లు అన్ని సర్వేలూ చెబుతున్నాయని సీఎం తెలిపారు.

## బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి

- కవిత మధ్యలో వచ్చి మధ్యలో వెళ్లిపోయింది
- వేముల ప్రశాంత్ రెడ్డి కామెంట్
- కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించు
- మిమ్మల్ని కలుపడానికే ప్రయత్నించాను
- విడగొట్టడానికి కాదు అని మాజీ మంత్రి వెల్లడి

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

సీఆర్‌కు కష్టకాలంలో వెంట ఉన్నది ఎవరో ముందు కవిత తెలుసుకోవాలి. నీ వల్ల నీ తండ్రి కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించావా కవిత? మిమ్మల్ని కలుపడానికే ప్రయత్నించానే తప్పా విడగొట్టడానికి కాదు అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తనపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై వేముల స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఏం చేశానే ఉద్యమ నాయకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసన్నారు. పార్టీ లైను దాటిన తర్వాతనే కవితపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

## 'సర్' గడువు పెంపు

- ఈ నెల 10 వరకు పెంచుతూ నిర్ణయం
- కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) వెల్లడి
- అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5 వరకు
- అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

2లో..



## మరో రూ.100 కోట్లు మంజూరు

- గోదావరి తీర గ్రామాల అభివృద్ధికి
- డిప్యూటీ సీఎం పవన్ సంచలన నిర్ణయం
- మౌలిక సదుపాయాల కల్పన కోసం
- గ్రామీణాభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం



**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు.. దేశ అభివృద్ధి గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమవుతుందన్న గాంధీజీ మాటలను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్య మంత్రి చేతల్లో చూపిస్తున్నారు. గోదావరి తీర ప్రాంతంలోని గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయించిన పవన్.. ఇప్పుడు మరో రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయించారు.

2లో..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ
- వెయ్యి రోజుల పాలనపై విమర్శలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.



2లో..

## నీట్ కేసులు రద్దు చేయండి

- సుప్రీంకోర్టును కోరిన 4 రాష్ట్రాలు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం..
- విద్యార్థులపై నమోదైన 116 ఎఫ్ఐఆర్‌లు



2లో..

## ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు

- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పోలవరం ఎడమ కాలువ ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి
- ఎల్ఎంసీతో విశాఖకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రత
- రెండేళ్లలో ఎల్ఎంసీ పనులను పూర్తి చేశాం-మంత్రి నిమ్మల రామానాయుడు

7లో..

## చేనేతలకు ఆప్కో చెల్లింపులు

- కొనుగోళ్లు చేసిన వస్త్రాలకు ఎప్పటికప్పుడు సహకార సంఘాలకు చెల్లింపులు
- రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు
- సత్ఫలితాలిస్తున్న మంత్రి సవిత సమీక్షలు
- మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు

7లో..



ఆప్కో

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- మంగళగిరిలో ప్లీనరీ జరిగినప్పుడు..
- వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై
- రెస్ట్ రూమ్‌లో ఇద్దరి మధ్య వివాదం
- మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమే

2లో..

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై అసత్య ప్రచారం చేయొద్దు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదిక విడుదల
- సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్నది..
- నివేదిక సత్యదూరమని బండి కామెంట్



7లో..



# విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంతో పాటు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు నడ్డా తెలిపారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల అభ్యున్నతి, వికాసమే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించాల్సిన ర్యాలీని విరమించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించడాన్నీ కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్వాగతించారు.

కాగా, నీట్ పేపర్ లీక్‌తో దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో సీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. కొన్ని వారాలపాటు ఆందోళనలు కొనసాగగా.. జులై 20 నుంచి 25 మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో నిరసనకారులపై కేసులు నమోదయ్యాయి. అయితే, విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు నేడు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీజేపీ నిరసనలకు సంబంధించిన కేసులను ఉపసంహరించుకుంటామని, కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమన్న కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

# నీట్ కేసులు రద్దు చేయండి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01, అనంజతనశక్తి న్యూస్**

నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల ఆందోళనలకు సంబంధించి నమోదైన కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులపై నమోదైన 116 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కోరుతూ బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమ రాష్ట్రాల్లో నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ 4 రాష్ట్రాలు వేర్వేరు పిటిషన్లలో విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఆందోళనలు విరమిస్తే వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని జులై 25న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి ఇచ్చిన హామీని ఆయా రాష్ట్రాలు తమ పిటిషన్లలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 5న ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రాలు వేగంగా స్పందించినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన కేసుల ఉపసంహరణపై సుప్రీంకోర్టు తదుపరి విచారణలో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు. ''ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# మరో రూ.100 కోట్లు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. మొత్తం నిధులలో రూ.90 కోట్ల నిధులను పంచాయతీరాజ్ శాఖ మంజూరు చేయగా, రూ.10 కోట్లను ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మంజూరు చేయించారు. ఈ నిధులను గోదావరి తీర ప్రాంతంలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి కేటాయించనున్నారు. మొత్తం రూ.100 కోట్లలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ.90 కోట్లను కేటాయించనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ తెలిపారు. మిగిలిన రూ.10 కోట్లలతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలను కల్పిస్తామని ఆయన తెలిపారు.



# టెర్రరిజాన్ని తుడిచిపెట్టేయాలి

(మొదటి పేజీ తరువాయి)

'మానవాళి మొత్తానికి ఉగ్రవాదం తీవ్రమైన సవాల్' అని అభివర్ణించారు. దీనిపై పోరాటం కేవలం 'చర్యప్రతిచర్య' ఆలోచనకే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు సదస్సుకు హాజరైన పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌కు మోదీ చురకలంటించారు.

''ఉగ్రవాదానికి సంబంధించి ఫైనాన్సింగ్, రిక్రూట్‌మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా మొత్తం నెట్‌వర్క్‌ను మనం నిర్మూలించాలి. ఈ తీవ్రమైన అంశంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని మనం ఒకే గొంతుతో స్పష్టం చేయాలి' అని ఆయన అన్నారు. ''ఉగ్రవాదాన్ని తమ విధానంగా మార్చుకుని వారికి ఆశ్రయం, మద్దతు ఇస్తున్న దేశాలకు... ఉగ్రవాదం ఎప్పటికీ ఎవరికీ 'హామీ ఇచ్చే వ్యూహాత్మక ఆస్తి' కాజాలదని గట్టి సందేశం పంపాలి'' అని ప్రధాని స్పష్టం చేశారు.

షాంఘై సహకార కార్పొరేషన్ కోసం భారత విజన్ వెల్లడించిన ఆయన.. ''భద్రత, అనుసంధానత, అవకాశాలు'' అనే మూడు ముఖ్యమైన స్తంభాలని వివరించారు. వీటిలో శాంతి భద్రత మొదటి స్తంభంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ''ప్రశాంతమైన, సురక్షితమైన యురేషియా కోసం మన ఉమ్మడి కార్యాచరణ..



అఫ్గనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వంతో ముడిపడి ఉంది'' అని నొక్కిచెప్పిన మోదీ.. అఫ్గన్ ప్రజలకు భారత్ తన అభివృద్ధి, మానవతా సహాయాన్ని కొనసాగిస్తుందని పునరుద్ఘాటించారు.

పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడుతూ.. ఒక ప్రాంతంలో ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా 'ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులపై' దెబ్బతీస్తాయని మోదీ అన్నారు. ''దీనివల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే అత్యధికంగా నష్టపోతున్నాయి.. అందుకే అన్ని రకాల ఉద్రిక్తతలు, యుద్ధాలకు పరిష్కారం యుద్ధభూమిలో సాధ్యం కాదని, కేవలం 'చర్చలు, దౌత్యం' ద్వారానే సాధ్యమని భారత్ పదే పదే నొక్కి చెబుతుంది'' అని అన్నారు.

మరోవైపు... డ్రగ్స్ అక్రమ రవాణా యువతకు, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించిందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా బెదిరింపులు, వ్యవస్థీకృత నేరాలు, సమాచార భద్రత, నార్కోటిక్స్ వ్యవహారాలను పర్యవేక్షించే ఎస్‌సిఓ యంత్రాంగాల ద్వారా మరింత బలమైన సహకారం అందించాలని కోరారు. ''సకాలంలో చర్యలు చేపట్టడానికి, ఆచరణాత్మక సమన్వయానికి ఇవి సమర్థవంతమైన మాధ్యమాలుగా మారాలి'' అని మోదీ పిలుపునిచ్చారు.

ఎస్‌సిఓ సహకారం ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందించాలని, భవిష్యత్ కార్యాచరణలో 'ప్రజల మధ్య సంబంధాల'ను కేంద్ర బిందువుగా ఉంచాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ''మన ప్రయత్నాలు యువతకు ఎన్ని కొత్త అవకాశాలను సృష్టించాయి.. మన పారిశ్రామికవేత్తలకు ఎన్ని కొత్త మార్కెట్లను తెరిచాయి.. సాంకేతికత ద్వారా మన రైతులకు ఎంత లబ్ధి చేకూరింది.. మన పౌరుల జీవితాలు ఎంతగా మెరుగపడ్డాయి అనేదే మన విజయాన్ని కొలిచే నిజమైన కొలమానం'' అని వ్యాఖ్యానించారు.

ఈ శిఖరాగ్ర సదస్సుకు కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ అధ్యక్షత వహించి, ఆతిథ్యం ఇచ్చారు. ప్రధాని మోదీతో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ , ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇతర ఎస్‌సిఓ సభ్యదేశాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నేను మా తండ్రి వేముల సురేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం . 2001 తెలంగాణ ఆవిర్భావా ని కన్న ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు మధ్యలో పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత... ఇప్పుడు కష్ట కాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా కవితనా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది ఎవరో అందరికి తెలుసన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదని స్పష్టం చేశారు. కవిత కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా మంతనాలు చేయలేదని చెప్పగలదా? అని నిలదీశారు. నిరాధారణమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం చేస్తున్నావని మండిపడ్డారు. స్వలాభం కోసం వ్యక్తి



గత ప్రతిష్టలు దెబ్బ తీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదని హితవు పలికారు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని తెలిపారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నా వాళ్లను కవిత టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

**అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తున్నది**

కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని విమర్శించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడం రాజకీయంగా సింపతిని గేన్ చేయడానికి అని అర్థం అవుతుందని, అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నామని పేర్కొన్నారు. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించ డం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్

ఆయన పైన కేటీఆర్ పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదన్నారు. కానీ బాధగా అనిపించిందన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవిత పై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందన్నారు.

# 'సర్' గడువు పెంపు

**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

ఏపీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పొడిగించింది. ఈ నెల 10 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5 వరకు అవకాశం ఇచ్చింది. అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను సవరించి గడువును పొడిగించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 10వ తేదీ వరకు దాఖలు చేసుకోవచ్చు. ఓటర్ల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

అనంతరం అన్ని ప్రక్రియలను పూర్తి చేసి అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గడువులోగా తెలియజేసే అవకాశం మరింత పెరిగింది. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను సరిచేసేందుకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియ కీలకంగా ఉంటుంది. గడువు పొడిగింపుతో ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.

# విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజమేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు.

**సజ్జల దారుణంగా దూషించారు..**

ఈరోజు (మంగళవారం) నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు.



**విజయసాయిపై నాకు మంచి అభిప్రాయం లేదు..**

'నేను చాలా పెద్ద తప్పు చేశానని సజ్జల అన్నారు. అమరావతి రైతులు వరదలు, భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతుంటే నేను మాట్లాడాను. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు ఏ ఇబ్బంది వచ్చినా నేను అండగా ఉంటానని చెప్పా. అప్పుడూ సజ్జల... నన్ను చాలా పెద్ద తప్పు చేశావన్నారు. ఇలాంటి మాటలు నాతో మాట్లాడొద్దని.. ఆ తప్పు చేసింది.. నువ్వా, నేనా..? అని సజ్జలను ఎదిరించి మాట్లాడాను. మా ఊరిలో విజయసాయి మీటింగ్ పెట్టి నన్ను ఎలా పడితే అలా తిట్టాడు. ఆయనంటే నాకు మంచి అభిప్రాయం లేదు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

**వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోంది..**

'వైసీపీ హయాంలోని ఐదేళ్లు ప్రజావ్యతిరేక పాలన కొనసాగింది. దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఓ చరిత్ర అయితే, వైసీపీ ఘోర పరాజయం కూడా చారిత్రక ఘట్టం. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా... వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వికృత రాజకీయం చేస్తోంది. వైసీపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. హిందూ మతానికి ఘోర అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఆలయాల్లో రథాలు తగులపడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు మీ నోళ్లు ఏమయ్యాయి. తిరుపతి వేంకటేశ్వర ఛానెల్‌ను కూడా రాజకీయాలకు వాడుకున్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆయన కోడలు సంచలన ఆరోపణలు చేశారు. ఆమె పెళ్లి అయినప్పుడు హిందువులమని మాజీ మంత్రి చెప్పారని... పెళ్లి అయ్యాక హిందు దేవుళ్లని పూజిస్తే కొట్టారని ఆమె చెప్పింది. జగన్, వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఎందుకు ఈ విషయంపై స్పందించట్లేదు. ఏపీని అస్థిరపరచాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం. వైసీపీ క్రెడిట్ చోరీ చూస్తుంటే... నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు. ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు.

## మమతా బెనర్జీ మేనకోడలు

# అనుమానాస్పద మృతి

**కోల్‌కతా అనంత జనశక్తి న్యూస్**

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ మేనకోడలు 28 ఏళ్ల బ్రిస్టీ ముఖర్జీ అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. బీర్భుమ్ జిల్లా కుసుంబా గ్రామంలోని తన ఇంట్లో మంగళవారం ఆమె మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఉరికి వేలాడుతూ కనిపించారని, దీనిని ఆత్మహత్య కేసుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రాంపూర్‌హాట్ ప్రాంతంలోని కుసుంబా గ్రామంలోని ఆమె ఇంటి రెండో అంతస్తులోని ఒక గదిలో బ్రిస్టీ ముఖర్జీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపినట్లు పీటీఐ వార్తా సంస్థ నివేదించింది.

ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ''మృతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించాం.. దర్యాప్తు కొనసాగుతోంది. పోస్ట్‌మార్టం, విచారణ అనంతరం మరణానికి దారితీసిన పరిస్థితులు స్పష్టమవుతాయి'' అని ఆయన అన్నారు. కుటుంబసభ్యుల ప్రకారం.. వైవాహిక బంధం సాఫీగా సాగలేదని, విడాకుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గత కొన్నేళ్లుగా డిప్రెషన్‌తో బాధపడుతోన్న బ్రిస్టీ.. వైద్య చికిత్స తీసుకుంటున్నట్టు వివరించారు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నేత అయిన బ్రిస్టీ తండ్రి నిహార్ ముఖర్జీ.. మమతా బెనర్జీకి కజిన్. బెంగాల్‌ను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో ఆమె టీచర్‌గా ఎంపికయ్యారనే ఆరోపణలను రిష్టి ముఖర్జీ ఎదుర్కొన్నారు. అయితే, నియామక ప్రక్రియలో అవకతవకల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత ఆమె ఉద్యోగం కోల్పోయారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖర్జీ మరణంపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. పోస్ట్‌మార్టం నివేదికలో మృతికి గల కారణాలపై మరింత స్పష్టతనిస్తుందని భావిస్తున్నారు. కొద్ది రోజుల కిందట రాంపూర్‌హాట్‌లోని పార్టీ కార్యాలయంలో సీనియర్ తృణమూల్ కాంగ్రెస్ నేత, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ ఉరి వేసుకున్న కొద్ది రోజులకే ఆమె మరణం సంభవించింది.

# నేపాల్ వరదల్లో తల్లిదండ్రుల గల్లంతు.. కన్నీటితోనే నీట్ పరీక్ష




నేపాల్ వరదల్లో తల్లిదండ్రులు గల్లంతైనా.. ఆ బాధను అదిమిపెట్టి ఓ యువతి నీట్ పరీక్ష రాసింది. కైలాస మానసరోవర యాత్ర కోసం వెళ్లిన వందలాది మంది భారతీయులు నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. ఈ యాత్రకు వెళ్లిన తన తల్లిదండ్రులు కూడా చిక్కుకుపోయారని తన్వి అనే నీట్ అభ్యర్థి సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులు వెంకట్రామ్ అన్నందేవర, అనఘ 67 మందితో కూడిన బృందంతో కలిసి కైలాస యాత్రకు వెళ్లినట్లు తెలిపారు. వారు నేపాల్‌లోని ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్నప్పుడు చివరిసారిగా తనతో మాట్లాడారని తెలిపింది. ప్రస్తుతం వారు తన పక్కన లేకపోయినా.. వారి కోరిక మేరకు నీట్ పరీక్ష రాశానని చెప్పారు.

'మూడు గంటల పరీక్షా సమయంలో దాదాపు సగం సమయం కన్నీళ్లతోనే గడిపాను. అడ్మిట్ కార్డుపై ఉన్న ఫొటోను నా తండ్రే తీశారు. పరీక్ష రాస్తున్నప్పుడు అది కనిపించి, ఆయన పదే పదే గుర్తుకు రావడంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యాను. మానసికంగా ఎంతో సంఘర్షణకు గురైనప్పటికీ.. అమ్మానాన్న కోరిక మేరకు ఈ పరీక్ష తప్పకుండా రాయాలని నిర్ణయించుకున్నా. నా భవిష్యత్తు కోసం వారు ఎన్నో కలలు కన్నారు. నేను ఏ పరీక్షకు వెళ్లినా.. అందులో మంచి మార్కులు సాధించాలని కోరుతూ అమ్మ ప్రతిసారి పెరుగులో పంచదార కలిపి తినిపించేది. కానీ ఇప్పుడు ఆమె నా పక్కన లేకపోవడం నన్ను మరింత కుంగదీసింది. వారు సురక్షితంగా తిరిగి వస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నా' అని తన్వి కన్నీరు పెట్టుకున్నారు.

# మాపై బాహ్య ఒత్తిళ్లేమీ లేవు

**- సోనియా గాంధీ ఆత్మకథ ప్రచురణ వివాదంపై పెంగ్విన్ ఇండియా వెల్లడి**





కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' గ్రంథాన్ని ప్రచురించకపోవడానికి తమపై బాహ్య ఒత్తిళ్లే కారణం అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా (పీఆర్‌హెచ్‌ఐ) సంస్థ పేర్కొంది. ఆ పుస్తక రచయిత్రితో చర్చల సమయంలో ఒక నిర్దిష్ట అంశంపై ప్రతిష్టంభన నెలకొనడం వల్లే ప్రచురించలేకపోతున్నామని పీఆర్‌హెచ్‌ఐ అధికార ప్రతినిధి పల్లవీ నారాయణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందం, రచయిత్రి గోప్యతను కారణంగా చూపుతూ ప్రతిష్టంభనకు కారణమైన ఆ వివాదాస్పద అంశమేమిటో ప్రచురణ సంస్థ వెల్లడించలేదు. ''ప్రచురణకు ముందు రాతప్రతిని నిశితంగా పరిశీలించడం మా బాధ్యత, విధి. కొన్ని ప్రశ్నలు అడగడం, సిఫార్సులు చేయడం సంపాదకీయ స్వేచ్ఛలో భాగమే. రచయిత్రి తరపు బృంద సభ్యులు కొన్ని మార్పులకు అంగీకరించారు. మరికొన్నింటికి అంగీకరించలేదు. దురదృష్టవశాత్తు ఒకానొక అంశంపై అవగాహనకు రాలేకపోయాం. దీనిలో భాగంగానే ప్రచురణపై ముందుకు వెళ్లాలనుకోవడం లేదని రచయిత్రి తరపు బృందం సభ్యులు తెలిపారు. వారి అభిప్రాయాన్ని మేం గౌరవించాం'' అని పీఆర్‌హెచ్‌ఐ వివరించింది. ప్రతిష్టంభనకు కారణమైన అంశాన్ని వెల్లడించలేమని స్పష్టం చేసింది.

# అశ్లీల యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

**- వాటి ముసుగులో మాల్‌వేర్ చొరబాటు**
**- సైబర్ నేరగాళ్లకు అవకాశమిచ్చినట్లే**
**- జాతీయ సైబర్ సెక్యూరిటీ సంస్థ హెచ్చరిక**



సామాజిక మాధ్యమ వేదికలపై కనిపించే అశ్లీల (పోర్న్) యాప్‌ల ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని సెల్‌ఫోన్ యూజర్లను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరించింది. ఆ యాప్‌ల ముసుగులో ప్రమాదకర మాల్‌వేర్ సెల్‌ఫోన్లలోకి చొరబడుతుందని తెలిపింది. వీటి ద్వారా జరిగే ఆర్థిక మోసాలు ఇటీవల బాగా పెరిగాయని వెల్లడించింది. ఈ యాప్‌లు ఫోన్ డివైజ్‌ను తమ నియంత్రణలోకి తీసుకుని, అనధికార ఆర్థిక లావాదేవీలకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొంది. ఆండ్రాయిడ్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఇతర విశ్వసనీయ యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ప్రకటనలు, వెబ్‌సైట్లు, అనుమానాస్పద లింక్‌ల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోరాదని హెచ్చరించింది. తెలియని యాప్‌లకు అనుమతులు ఇవ్వవద్దని కోరింది. ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లను క్రమం తప్పకుండా సమీక్షించి, తమకు తెలియని వాటిని తొలగించాలని కూడా వినియోగదారులకు సూచించింది.

'నైట్ ప్లే, రీలూప్, కిస్, విమో, రివో, నెక్సో, విక్సా వంటి యాప్‌లు వినియోగదారులను సోషల్ మీడియా ప్రకటనల నుంచి అశ్లీల కంటెంట్‌ను అందించే వెబ్‌సైట్‌లకు మళ్లిస్తాయి' అని ఐ4సీ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ సైబర్‌క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ హెచ్చరించింది.

ఇప్పటికే ఫోన్ హ్యాకింగ్‌కు గురైతే మొదట దాన్ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి, అనుమానాస్పద అప్లికేషన్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయాలని సూచించింది. అప్పటికీ మాల్‌వేర్ పోకపోతే వినియోగదారులు యాప్ యాక్సెసిబిలిటీ యాక్సెస్‌ను డిసేబుల్ చేయాలని పేర్కొంది. ఫోన్ రీస్టార్ట్ చేసిన తర్వాత కూడా యాప్ తొలగకపోతే ముఖ్యమైన డేటాను బ్యాకప్ చేసి ఫోన్‌ను రీసెట్ చేయాలని సిఫార్సు చేసింది.

ఉగ్రవాదులు రహస్యంగా మాట్లాడేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారని ఇటీవలే జాతీయ భద్రతా సంస్థలు గుర్తించాయి.

# మీ విన్నపం ఏమిటో ఒకసారి చదవండి



పురుషుల మాయమాటల వలలో చిక్కుకుని లైంగికంగా మోసపోయిన మహిళలకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 69 నిబంధన కింద భార్య హోదాతో పాటు ఆర్థిక రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. వివాహానికి ముందు లైంగిక సంబంధాలపై ఓ తీర్పులో చేసిన వ్యాఖ్యల పట్లా పిటిషనర్ అభ్యంతరం తెలిపారు. ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలపైనా కేసులు నమోదు చేయాలన్న న్యాయవాది ఎన్.సుదర్శన్‌రావు పిటిషన్.. అపఖ్యాతికరంగా, నిర్లక్ష్యం, ధిక్కారపూరితంగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. బాధ్యతాయుతమైన న్యాయవాదిగా ఉంటూ ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయొద్దని హితవు పలికారు. ఇలాంటి పిటిషన్లు దాఖలుచేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన న్యాయవాది సుదర్శన్‌రావు వాదనలు వినిపించడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీరు ఒకసారి మీ పిటిషన్‌లోని విన్నపాన్ని అందరి ముందు చదవండి. కోర్టు హాలులో కూర్చున్న లాయర్లు వింటారు. దేశంలో పిటిషన్ల రచన ఎలా జరుగుతుందో తెలుసుకుంటారు' అని సీజేఐ అన్నారు. అయితే, సుదర్శన్‌రావు చదవకపోవడంతో పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

**ఖర్గేపై పిటిషన్ సందర్భంగా...**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి వ్యతిరేకంగా సుదర్శన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టేస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. దీనిపై సుదర్శన్‌రావు స్పందిస్తూ...'ఖర్గే భాజపా సభ్యులను చంపేయమంటున్నారు. నేను కూడా భాజపా సభ్యుడినే. ఇలాంటి కేసును ఎందుకు కొట్టేస్తున్నారు? దిస్ ఈజ్ టూమచ్. భాజపా సభ్యులను చంపేయమన్న ఖర్గేను, ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్న డిమాండ్‌కు మీరు సమర్థిస్తున్నారా? ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడానికి అంబేద్కర్ మద్దతివ్వలేదు' అని వాదించారు. ఆ న్యాయవాది స్థితిని గమనించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అతని రెండో పిటిషన్‌ను చదమని కోరారు.

# ప్రియురాలు బైక్‌పై కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం సహజమే'

**- రోడ్డు ప్రమాదం కేసులో మదురై ధర్మాసనం వ్యాఖ్య**



బైక్‌పై ప్రియురాలు కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం రావడం సహజమేనని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడులోని తేనికి చెందిన గోపాల్(19) 2018 మే 10న బైక్‌పై ఓ యువతితో కలిసి వెళుతుండగా వ్యాను ఢీకొంది. గోపాల్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి మృతికి పరిహారం కోరుతూ అతడి తల్లిదండ్రులు కేసు వేయడంతో తేని కోర్టు రూ.25 లక్షలు ఇవ్వాలని ఇన్సూరెన్స్ సంస్థకు ఉత్తర్వులిచ్చింది. వీటిని సవాలు చేస్తూ బీమా సంస్థ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేసింది. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతిల ధర్మాసనం విచారణ జరిపింది. ప్రమాదానికి ద్విచక్ర వాహనం నడిపిన గోపాల్ ఓ కారణమని, పరిహారంలో సగం తగ్గించాలని ఇన్సూరెన్స్ సంస్థ వాదించింది. 'ప్రమాదం తెల్లవారుజామున జరిగింది. బైక్ నడిపిన 19 ఏళ్ల యువకుడి వెనుక వైపు అతడి ప్రియురాలి కూర్చుంది. అలాంటి సమయంలో ఎవరికైనా ఉత్సాహం వస్తుంది. వ్యాన్ సరైన మార్గంలో వెళుతున్నందున ప్రమాదంలో గోపాల్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు కన్పిస్తోంది. ఆ మేరకు పరిహారాన్ని 25 శాతం తగ్గించాలి' అని ఉత్తర్వుల్లో న్యాయమూర్తులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు



నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, దిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ (CJP) తెలిపింది.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 2025 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

# బ్యాంకు ఆడిట్‌లో బయటపడిన రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు



ఉత్తర్‌ప్రదేశ్ సహారన్‌పుర్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని (PNB) కరెన్సీ చెస్ట్‌లో సుమారు రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు బయటపడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు బ్యాంకు అధికారులతో పాటు ఓ హౌస్‌కీపర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవి కుమార్ కేస్, కరెన్సీ చెస్ట్ మేనేజర్లు సుశీల్ శర్మ, అమిత్ కుమార్‌లను బ్యాంకు సస్పెండ్ చేసింది.

కరెన్సీ చెస్ట్ నుంచి బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపిన నగదులో రూ.4.30 లక్షలు తగ్గినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పీఎన్‌బీ మేరఠ్ శాఖకు సమాచారం అందించారు. వెంటనే బ్యాంకు నోడల్ అధికారి అరుణ్ కుమార్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. విశాల్ కుమార్ అనే పార్ట్‌టైమ్ హౌస్‌కీపర్ నోట్ల కట్టల నుంచి నగదు తీస్తున్నట్లు గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు కరెన్సీ చెస్ట్‌లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించారు. ఇందులో పలు అవకతవకలతో పాటు సుమారు రూ.7.40 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యేక విచారణ బృందాన్ని (SIT) ఏర్పాటు చేసినట్లు డీఐజీ అభిషేక్ తెలిపారు. ఈ నకిలీ కరెన్సీని ఎవరు చేర్చారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది

# విమానం గాల్లో ఉండగా.. ఇంజిన్ వైఫల్యం



గాల్లో ఉన్న సమయంలో ఇండిగో విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటన గోవాలో చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో 220మంది ప్రయాణికులు ఉన్నారు. ఉదయం 9:16 గంటలకు ఎయిరిండియా విమానం గోవా నుంచి దిల్లీ బయల్దేరింది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు సమాచారం ఇచ్చారు. దీంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానాన్ని వెనక్కి మళ్లించిన పైలట్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మరో విమానంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

# ఎండలో నిలబెట్టిన టీచర్.. పదేళ్ల విద్యార్థిని మృతి



దేశ రాజధాని దిల్లీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పుస్తకం తెచ్చుకోలేదని టీచర్ ఎండలో నిలబెట్టడంతో.. పదేళ్ల విద్యార్థిని మృతిచెందింది! తూ ర్పు వినోద్ నగర్‌లోని సర్వోదయ కన్యా విద్యాలయలో ఆగస్టు 27న చోటుచేసుకున్న ఈ ఘట నపై దిల్లీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతానికి టీచర్‌పై బదిలీ వేటు వేసింది. విద్యా ర్థిని తల్లి అంజలి కథనం ప్రకారం.. ఆగస్టు 27 ఉదయం ఆమెకు పాఠశాల నుంచి ఫోన్ వచ్చింది. అక్కడికి వెళ్లేసరికి ఆమె కుమార్తె ఎండలో నిల్చొని ఉంది. ఆరోగ్యం అప్పటికే బాగా క్షీణించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. పాఠశాలకు ఓ పుస్తకం తెచ్చుకోనందుకే పాపను టీచర్ ఎండలో నిలబెట్టినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
బుధవారం | అనంతపురం
02.09.2026
EDITORIAL NEWS ఎడిటోరియల్



## పర్యావరణ పరిరక్షణలో

# మనమెక్కడో..!

అమెరికాలోని యేల్, కొలంబియా విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఇటీవల 'పర్యావరణ పనితీరు సూచీ-2026'ని విడుదల చేశారు. 177 దేశాలకుగాను ఎస్తోనియా, లక్జెంబర్గ్, యూకే, ఫిన్లాండ్, నెదర్లాండ్‌స్‌లు ఈ సూచీలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచాయి. ఎస్తోనియా వందకు 74.79 స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంటే, లావోస్ 21.78 పాయింట్లతో అట్టడుగున ఉంది. భారత్ 22.46 స్కోరుతో 176వ స్థానానికి పరిమితమైంది. మరి ఈ పరిస్థితికి కారణమేంటి, పర్యావరణ పరిరక్షణలో మనం ఎలా ముందుకెళ్లాలి?

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు 'పర్యావరణ పనితీరు సూచీ' ఒక శక్తిమంతమైన సాధనం. సుస్థిరత దిశగా ప్రయాణించాలనుకునే దేశాలకు ఇది ఆచరణీయ మార్గనిర్దేశాన్ని అందిస్తుంది. ఆ క్రమంలో పర్యావరణ పనితీరుకు సంబంధించిన అంశాల్లో ఆయా దేశాల పురోగతికి ఇది అద్దం పడుతుంది. తాజా సూచీలోని మొదటి 20 స్థానాల్లో జపాన్ మినహా మిగతావన్నీ ఐరోపా దేశాలే. వియత్నాం, మాలి, బంగ్లాదేశ్, ఇండియా, లావోస్‌లు చివరి అయిదు స్థానాలకే పరిమితమయ్యాయి. అమెరికా 27వ స్థానంలో నిలిస్తే, చైనా 129వ స్థానంతో సరిపెట్టుకుంది. పర్యావరణ ఆరోగ్యం విషయంలో అమెరికా మంచి ఫలితాలనే సాధించినప్పటికీ, వాతావరణ మార్పుల ఉపశమన చర్యలు, జీవవైవిధ్య సంరక్షణ విషయంలో మందకొడి ప్రగతి వల్ల సూచీలో వెనకబడిపోయింది. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ కట్టుబాట్ల నుంచి అమెరికా తప్పుకొంటున్న నేపథ్యంలో, రాబోయే సంవత్సరాల్లో అగ్రరాజ్యం ఈ సూచీలో మరింత వెనకబడిపోవచ్చని నివేదిక అభిప్రాయపడింది. చైనా వాయుకాలుష్యం, నీటిశుద్ధి, ఘనవ్యర్థాల నిర్వహణలో మెరుగైన పనితీరునే కనబరుస్తున్నా, వాతావరణ మార్పుల ఉపశమన చర్యల విషయంలో వెనకపట్టున ఉంది. సౌరశక్తి, జలశక్తి వంటి శుద్ధ ఇంధనాలు, విద్యుత్ వాహనాలు, అధునాతన బ్యాటరీ సాంకేతికతలపై భారీగా పెట్టుబడులను పెట్టినప్పటికీ, బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిపైనే డ్రాగన్ ఎక్కువగా ఆధారపడుతోంది.

**భారత్‌లో తీవ్ర వాయుకాలుష్యం...**

అధ్యయనకర్తలు జీవవైవిధ్యం, జీవుల ఆవాసాల పరిరక్షణ, అడవుల నరికివేత, వాయు కాలుష్య స్థాయులతోపాటు వ్యవసాయ, జలవనరుల, మత్స్యరంగ సమస్యలనూ పరిగణనలోకి తీసుకుని ఆవరణ వ్యవస్థ జీవశక్తిని లెక్కించారు. గాలి నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీరు, భారీలోహాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలతో పరిసరాల ఆరోగ్యాన్ని గణించారు. వాతావరణ మార్పుల ఉపశమన చర్యల మదింపునకు కార్బన్ డయాక్సైడ్, మీథేన్, గ్రీన్‌హౌస్ వాయు స్థాయులను తీసుకున్నారు. పర్యావరణ పనితీరు మదింపులో ఆవరణ వ్యవస్థ జీవశక్తికి దాదాపు సగం; పరిసరాల ఆరోగ్యానికీ, వాతావరణ మార్పులకూ సగం ప్రాధాన్యమిచ్చారు. పర్యావరణ పనితీరులోని మొత్తం 47 సూచికల్లో సగానికి పైగా ఏఐ ఆధారిత సాధనాలపైనా, ఉపగ్రహాల ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే సాంకేతికతలపైనా ఆధారపడినవే కావడం విశేషం. మునుపు కొలవడానికి కష్టతరమైన ఆవరణ వ్యవస్థలు, ఇతర పర్యావరణ పరిస్థితుల గురించి ఇవి కొత్త కోణాలను ఆవిష్కరించాయి. గడ్డి భూముల పరిరక్షణను తాజా నివేదికలో ఒక కొత్త సూచికగా పరిగణించారు. ప్రపంచంలోని గడ్డి మైదానాలు సగంమేర క్షీణించాయనీ, మిగిలినవి ఆక్రమణలు, వాతావరణ మార్పుల వల్ల ముప్పు ఎదుర్కొంటున్నాయని నివేదిక హెచ్చరించింది.

పర్యావరణ పనితీరు సూచీలో ఇండియా ఎక్కడో దిగువన ఉండటానికి తీవ్ర వాయుకాలుష్యం, బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి, పరిమిత జీవవైవిధ్య రక్షణలే ప్రధాన కారణాలు. తలసరి ఉద్గారాలు తక్కువేకానీ- పట్టణ వాయుకాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు వేగంగా ఎగబాకుతున్నాయి... గడచిన దశాబ్దకాలంలో సూక్ష్మధూళి కణాలు, కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్‌ల మూలంగా వాయు నాణ్యతా సూచీలు రుణాత్మక విలువలను పొందినట్లు నివేదిక వివరించింది. 2022 నాటి పర్యావరణ పనితీరు సూచీలో ఇండియా చిట్టచివరన 180 స్థానంలో నిలిచింది. అయితే, సూచీ విశ్లేషణకు ఎంచుకున్న పద్ధతి అశాస్త్రీయంగా ఉందనీ, పలు సూచికలు ఊహాగానాలపై ఆధారపడి మాత్రమే ఉన్నాయని భారత్ తప్పుపట్టింది.

**ముందున్న దేశాలకూ తప్పని సవాళ్లు**

పర్యావరణ పనితీరులో అత్యున్నత ర్యాంకులు సాధించిన ఐరోపా దేశాలు సైతం సుస్థిరాభివృద్ధికి సంబంధించి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ సుస్థిరతలో అవి బలహీనపడ్డాయి. తొలి 20 స్థానాల్లో నిలిచిన జపాన్ సైతం ఈ విభాగంలో 139వ స్థానానికే పరిమితమైంది. ప్రపంచంలోని ఏ దేశమూ 75 పాయింట్లను మించి సాధించకపోవడం- సూచీ కఠినమైన ప్రమాణాలనూ; అగ్రస్థానాల్లో నిలిచిన దేశాలు సైతం కొన్ని అంశాల్లో తమ స్థితిని మెరుగుపరచుకోవాల్సిన ఆవశ్యకతనూ తెలియజేస్తుంది. అభివృద్ధి సాధనకు పర్యావరణాన్ని మూల్యంగా చెల్లించుకోవాల్సిన అవసరం లేదని బోట్‌స్వానా, కోస్టారికాల సుస్థిర, పటిష్ఠ ఆర్థికాభివృద్ధి గాథలే చాటిచెబుతున్నాయి. భారత్ వంటి వర్ధమాన దేశాలకు ఇవి ఎంతైనా స్ఫూర్తిదాయకం.

# ఘనమైన చట్టం... అమలులో అధ్వానం!

- రోహిణి కమిషన్: ఆరేళ్ల విచారణ... మూడేళ్లుగా మౌనం!
- ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదంటే... కేంద్రం ఇంకా ఎందుకు మౌనం వహిస్తోంది?






డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

**భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు — OBCల — రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది.అసలు ప్రశ్న సూటిగా ఉంది:ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?**

**రిజర్వేషన్‌లోనే అసమానత?**

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీంకోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది.కానీ ఓబీసీలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు. కొన్ని వర్గాలు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి?ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న.కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఓబీసీల్లోని వివిధ ఉప వర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన.అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

**కొద్దిమందికే ఎక్కువ ప్రయోజనమా?**

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఓబీసీ వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఓబీసీ వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది.ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు.రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

**గణాంకాల గందరగోళం**

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది — నమ్మదగిన కులాల వారీ గణాంకాల కొరత.భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కుల గణన 1931లో జరిగింది. 2011 సామాజికఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఓబీసీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది:వ్యక్తిగత ఓబీసీ వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి?అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది:పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా?డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

**14 సార్లు గడువు పొడిగింపు**

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది.మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14 సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం.చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జూలై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు.కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు.ఇక్కడే అసలు ప్రశ్న:కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు?కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు.కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పం.

**క్రీమీ లేయర్ వేరు... ఉపవర్గీకరణ వేరు**

ఓబీసీ చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి — క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ.క్రీమీ లేయర్ విధానం ద్వారా ఓబీసీల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు.ఉపవర్గీకరణ మాత్రం ఓబీసీలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది.ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

**చట్టం కంటే రాజకీయమే పెద్ద అడ్డంకా?**

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కాస్ట్‌స్‌లో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది.ఈ తీర్పు నేరుగా ఓబీసీలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది.అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు — రాజకీయాలు కూడా.27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు.కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.

**ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం**

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది:ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా?కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి. రాష్ట్రాలు, ఓబీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి.2023లో నివేదిక సమర్పించబడింది. 2026లో కూడా ప్రశ్న అలాగే ఉంది.ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా?లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా?రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం.ఆ తలుపులు అందరికీ సమానంగా తెరుచుకునేలా చేయడం — అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

# ప్రజలు వెచ్చించే సొమ్ముకు తగినట్లుగా

**ప్రజలు వెచ్చించే సొమ్ముకు తగినట్లుగా నాణ్యమైన వస్తుసేవలను అందించాల్సిన వ్యాపార సంస్థల్లో అనేకం లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. రకరకాల మార్గాల్లో వినియోగదారులను బులిపించి బుట్టలో వేసుకుంటూ, చివరికి వారి జేబులకు కత్తెరవేసి వదిలేస్తున్నాయి. ఇలాంటి వ్యాపార మాయాజాలాలను అరికట్టి బాధితులకు వేగంగా, తక్కువ ఖర్చుతో న్యాయం అందించడానికి నాలుగు దశాబ్దాల కిందటే వినియోగదారుల రక్షణ చట్టాన్ని తీసుకొచ్చారు. అందులో భాగంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో వివాద పరిష్కార వేదికలను కొలువుతీర్చారు. నేటి డిజిటల్ యుగ అవసరాలకు అనుగుణంగా ఆ శాసనాన్ని సవరించి ఆరేళ్ల క్రితం కొత్త నిబంధనావళినీ తెచ్చారు. కానీ, వినియోగదారుల కమిషన్లలో పదవులు వెంటనే భర్తీకాకపోతుండటంతో ఆ ప్రభావం కేసుల విచారణ మీద పడుతోంది. దీనిపై సుప్రీంకోర్టు లోగడ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జాతీయ వినియోగదారుల వేదికలో పెండింగ్ కేసుల మేటపై న్యాయపాలిక తాజాగా మరోసారి మండిపడింది. సామాన్యుల కష్టార్జితాలను స్వాహాచేసే వ్యాపార మోసాల నుంచి వినియోగదారులను రక్షించడంలో యంత్రాంగం అలక్ష్యం గర్హనీయం!**



లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాల మేరకు కిందటి నెల చివరి నాటికి రాష్ట్రస్థాయి వినియోగదారుల కమిషన్లలో అధ్యక్షుల పోస్టులు 50శాతం ఖాళీగా పడి ఉన్నాయి. 44శాతం సభ్యుల స్థానాలూ అలాగే అఘోరిస్తున్నాయి. జిల్లా స్థాయిలోనూ దాదాపు 37శాతం అధ్యక్షులు, 38శాతం సభ్యుల పోస్టులు భర్తీకి నోచుకోలేదు. గత పరిశీలనల ప్రకారం దేశవ్యాప్తంగా 90 జిల్లాల్లో వినియోగదారుల కమిషన్లు అసలు ఉనికిలోనే లేవు. ఆన్‌లైన్ షాపింగ్, ఫిన్‌టెక్ యాప్‌ల వినియోగం, కపట ప్రకటనల వెల్లువ అధికమైన క్రమంలో వినియోగదారుల కమిషన్లలో కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. వాటిని త్వరితగతిన కొలిక్కితెచ్చేందుకు తగిన సంఖ్యలో సిబ్బంది కొరవడటంతో వ్యాజ్యాలెన్నో బూజుపట్టిపోతున్నాయి. కేంద్రం లెక్కల ప్రకారం అన్ని వినియోగదారు కమిషన్లలో కలిపి ప్రస్తుతం దాదాపు ఆరు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా స్థాయిలోనే 4.48 లక్షల వ్యాజ్యాలు అపరిష్కృతంగా మూలుగుతున్నాయి. తత్ఫలితంగా బాధితులకు 90 నుంచి 150 రోజుల్లోగా ఉపశమనం కల్పించాలన్న చట్ట స్ఫూర్తి నీరుగారిపోతోంది!

వినియోగదారుల కమిషన్లు బలహీనపడితే నాసిరకం వస్తుసేవలు వెల్లువెత్తుతాయి. దీంతో వ్యాపారసంస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి కొనుగోళ్లకు వెనకంజవేస్తే దేశ ఆర్థిక వ్యవస్థే దెబ్బతింటుంది. నిరుద్యోగం కట్టు తప్పుతుంది. అలాంటి దుస్థితి తలెత్తకూడదంటే ఆయా కమిషన్లలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేయాలి. వినియోగదారుల చట్టంపై పట్టు ఉన్న, అర్హులైన న్యాయ నిపుణులకు నియామకాల్లో పెద్దపీట వేయాలి. అన్ని చోట్లా తగిన మౌలిక వసతులు కల్పించాలి. వాయిదాల సంస్కృతికి అడ్డుకట్ట పడేలా చూడాలి. మధ్యవర్తిత్వానికీ తగిన ప్రాధాన్యమివ్వాలి. సుప్రీంకోర్టు సూచించినట్లు రాష్ట్ర, జిల్లా స్థాయి వేదికల పనితీరును కాలానుగుణంగా సమీక్షిస్తే వాటి సామర్థ్యం మెరుగుపడుతుంది. జాతీయ వినియోగదారుల కమిషన్‌కు అనుబంధంగా ప్రాంతీయ, సర్క్యూట్ ధర్మాసనాలను ఏర్పాటుచేస్తే న్యాయార్థులకు అనవసర వ్యయ ప్రయాసలు తప్పుతాయి. కేసులూ త్వరగా తెములుతాయి. వంచనకు గురై ఆవేదనలో మునిగిపోయిన వారికి వినియోగదారుల వేదికలు చివరి ఆశ్రయాలే కాదు మార్కెట్‌ను క్రమశిక్షణలో ఉంచడంలోనూ అవి కీలకంగా వ్యవహరిస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు వాటికి కొత్త జవసత్వాలు అందించాలి!

# విదేశీ పర్యటనల విధి విధానాలు

**సార్వభౌమాధికారం అనేది ఒక దేశానికి తన విదేశీ వ్యవహారాలపై ఉండే సర్వోన్నతమైన, స్వతంత్ర అధికార పర్యవేక్షణ. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో మాత్రమే ఉంటుంది. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సంస్థానాధీశులు స్వతంత్ర రాజులుగా సర్వాధికారాలు చలాయించినా విదేశీ వ్యవహారాలు బ్రిటన్ పర్యవేక్షణలో ఉండేవి. స్వాతంత్ర్యం సిద్ధించాక అవి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. కేంద్రం పరిధిలోని విదేశాంగ మంత్రిత్వశాఖ మన దౌత్య విధానాలను అమలుపరుస్తున్నది. విదేశాలకు వెళ్లే సగటు భారతీయుడికి అవసరమైన పాస్‌పోర్టు మొదలు విదేశీ గమ్యస్థానం చేరుకున్న తర్వాత అక్కడ అతడి నడవడిని సైతం మన దౌత్య అధికారులు సదా గమనిస్తుంటారు. విదేశాలలోని మన రాయబారుల కార్యాలయాలు సంబంధిత దేశంలో మన అధికార ప్రముఖుల పర్యటనలను సమన్వయం చేస్తుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ ఆక్షేపణ తెలిపింది. దీంతో రేవంత్ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. బ్రిటన్‌లో పర్యటనను పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగిరావడం ప్రజల్లోను, రాజకీయ వర్గాలలోను చర్చనీయాంశమయింది.**

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం అనేది రాజకీయాలకు అతీతంగా జరిగే సాధారణ ప్రక్రియ. అధికార ప్రముఖుల విదేశీ పర్యటనలను విదేశాంగ విధానానికి అనుగుణంగా సమన్వయపరచడం విదేశీ వ్యవహారాల శాఖ విధి. బహిరంగంగా వెల్లడించలేని విధానానికి విభిన్నంగా పర్యటనలు ఉంటే వాటిని ఆక్షేపించడం, ఆపడం కూడా విదేశాంగశాఖ బాధ్యత.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. తెలుగు వాడైన ఒక కేంద్ర మంత్రికి విదేశాల నుంచి ఆహ్వానం ఉన్నా వారి పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. తెలుగు వాడైన మరో కేంద్ర మంత్రి విదేశాల్లో ఒక సదస్సుకు వెళ్లేందుకు అనుమతించారు. గతంలో కొందరు ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వలేదు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు.. పాకిస్థాన్‌లో సీనియర్ ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చే అడ్మినిస్ట్రేటివ్ కాలేజీలో ఉపన్యాసం ఇవ్వడంతో పాటు నవాజ్ షరీఫ్ సహా పలువురు రాజకీయ నాయకులను కలవడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2012లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్.. పాకిస్థాన్ పర్యటనలో జిన్నా సమాధిని సందర్శించేందుకు అనుమతించింది. అయితే 2026లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు ఆక్షేపణ తెలిపింది. ఈ అనుమతి నిరాకరణపై రాజకీయ రాద్ధాంతం చేయకుండా లండన్ నుంచి హుందాగా వెనక్కివచ్చి ఆయన కూడా విజ్ఞత ప్రదర్శించారు. తిరిగి వచ్చిన అనంతరం విలేఖరుల సమావేశంలో ఆచితూచి మాట్లాడారు.

ఒకప్పుడు విధి విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వ అధికారిక బృందాలు పరిమిత సంఖ్యలో విదేశీ పర్యటనలు చేసేవి. ఆ తర్వాత పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుబడుల కోసం ఉన్నతాధికారులతో సహా విదేశీ పర్యటనలకు వెళ్లడం ప్రారంభమయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడే ఈ తరహా విదేశీ పర్యటనలకు నాంది పలికారు. అవి సాధించిన సత్ఫలితాలకు ఆకర్షితులై గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆ తరువాత ఇతరులు విదేశీ పర్యటనలు చేశారు. పిదప, రాష్ట్రాల మంత్రులు సైతం విదేశీ పర్యటనలు మొదలుపెట్టారు.

ముఖ్యమంత్రుల, రాష్ట్ర మంత్రుల విదేశీ పర్యటనల వ్యయాన్ని రాష్ట్రాలే భరిస్తాయి. అయితే వీటి పట్ల జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ వ్యవహారాలశాఖ వ్యవహరిస్తోంది. అది స్వంత ఖర్చుతో వ్యక్తిగత పర్యటన అయినా కూడా విధిగా కేంద్రానికి సమాచారం అందించాలనే నిబంధన ఒకటి ఉన్నది. రాష్ట్రాల నేతలు విదేశీ గడ్డపై తమ రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మాట్లాడినా, అది జాతీయ విధానానికి భిన్నంగా ఉంటే, దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది కదా. అటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్త వహిస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు మర్యాద మన్ననలతో వ్యవహరించడం ముఖ్యం. ఏ దేశంలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో, ఎవరు ఏ స్థాయిలో ఎవరితో కలవాలి, ఎవరితో కలవకూడదు... అనే విషయమై కేంద్ర, రాష్ట్రాల అధికారిక బృందాలకు విదేశాంగశాఖ మార్గదర్శకం చేస్తుంది. విదేశాలలో ఎవరు అతిథ్యమిస్తున్నారు, ఎవరితో సమావేశమవ్వాలనుకుంటున్నారు ఇత్యాది విషయాలకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. చివరకు ఎవరైనా బహుమానం ఇస్తే స్వీకరించాలా వద్దా అనేది కూడా రాయబార కార్యాలయం నిర్దేశిస్తుంది. అవతలి వ్యక్తిని బట్టి వస్త్రధారణను సైతం సూచిస్తుంది.

భారతీయ అధికార బృందాలు విదేశీ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు వారు ఏమేమి మాట్లాడారు, ఏ రకంగా వ్యవహరించారనేది కూడా పక్కన ఉండే భారతీయ దౌత్యవేత్తలు క్షుణ్ణంగా గమనిస్తూ న్యూఢిల్లీకి నివేదిస్తారు.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో విదేశీ పెట్టుబడులు, వలసలకు ప్రాధాన్యం పెరిగిన కాలమిది. భారత నాయకులు ప్రత్యేకించి ప్రతిపక్ష నేతల విదేశీ పర్యటనల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా వాటిలో సమాఖ్య స్ఫూర్తి ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి ఉదంతంలో యూఏఈ మాజీ భారత రాయబారి కె.సి.సింగ్ వ్యాఖ్యానించడం ముదావహం.



అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

బుధవారం | అనంతపురం | 02.09.2026 | 01


# పేదల ఇంటి తలుపు తట్టే ప్రభుత్వం

**ధర్మవరం సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం పట్టణం 28వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి నేరుగా పెన్షన్ డబ్బులు అందజేయడం జరిగింది. పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిది. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇదే నిదర్శనం. పేదల సంక్షేమమే లక్ష్యంగా.. ఇచ్చిన మాటకు కట్టుబడి.. ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రజా ప్రభుత్వం ఇది.

# కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి దూసుకెళ్తోంది






**- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత**
**- పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు పంపిణీ**
**- రాప్తాడు నియోజకవర్గంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం**
**- పింఛన్ దారుల కళ్లలో ఆనందం స్పష్టంగా కనిపిస్తోందన్న సునీత**

**అనంతపురం సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

కూటమి పాలనలో సంక్షేమం,అభివృద్ధి దూసుకెళ్తోందని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండల కేంద్రంలో ఆమె పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ ఆమె పింఛన్లను అందజేశారు. పక్షావాతంతో మంచానికి పరిమితమైన వారికి 15వేలు, వివిధ సమస్యలు ఉన్నవారికి 6వేలు పింఛన్లు అందజేసి.. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం లేకపోతే.. మేము ఇలా ఉండే వారం కాదని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సునీతకు ఆప్యాయంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పాడి రైతులకు 50శాతం సబ్సిడీతో మంజూరైన పశువుల దానాను అందజేశారు. రాప్తాడు, గంగులకుంట, రామినేపల్లి గ్రామాలకు చెందిన వారికి.. ఒక రైతుకు 11వందల రూపాయలు విలువ చేసే దానాను 50శాతం సబ్సిడీతో పంపిణీ చేశారు. ఆ తర్వాత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 68వ జయంతి సందర్భంగా తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్, పరిటాల రవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కక్కలపల్లి టమోటా మండీల నిర్వాహకుల సహకారంతో, పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాప్తాడు మండలానికి చెందిన 20మంది చిరు వ్యాపారులకు 3లక్షల రూపాయల విలువైన, 20తోపుడు బండ్లను అందజేశారు. ఈకార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోయపాటి సుధాకర్, ఉపాధ్యక్షుడు గంగులకుంట కృష్ణ, కన్వీనర్ కొండప్ప, పార్లమెంట్, నియోజకవర్గ కమిటీల సభ్యులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో తోపుడుబండ్లు లేక చిరు వ్యాపారులు రోడ్డు పక్కన ఒక చోట కూర్చొని విక్రయించుకునే వారన్నారు. ఇప్పుడు ఈ బండ్లు రావడం వలన అన్ని ప్రాంతాలకు తిరుగుతూ చిరు వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలను పరిటాల ట్రస్ట్ ద్వారా చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. పింఛన్లు అందుకుంటున్న వారు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నవారికి 15వేలు, వికలాంగుల పింఛన్ 6వేలు వస్తోందన్నారు. అనారోగ్యంతో మంచాన పడినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే సాయం వారిని ఆదుకుంటోందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా మేము పని చేస్తున్నామన్నారు. పండమేరు వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామని.. ఇప్పుడు ఇక్కడ బ్రిడ్జి కూడా నిర్మిస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు...

# ప్రభుత్వ సేవల్లో.. సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం

**- సమాచార శాఖ జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్**

**కడప, సెప్టెంబరు 1:అనంత జనశక్తి న్యూస్**



అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని.. జోన్4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సిబ్బంది విధులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా సమాచారాన్ని అందించాలన్నారు.ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని, మీడియా ప్రతినిధులు వాస్తవ సమాచారాన్ని బాధ్యతాయుతంగా ప్రజలకు అందించాలని కోరారు.
జోన్4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్టం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఏడి రమేష్, డీఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీపీ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ పాల్గొన్నారు.

# పుట్టపర్తి చిత్రావతిని పరిశుభ్రంగా ఉంచుదాం

**- మురుగుతో ప్రాణికోటికి ముప్పు**
**- చిత్రావతి పారిశుధ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట**
**- రూ.50 లక్షలతో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 1:అనంత జనశక్తి ఈ**



పుట్టపర్తి పట్టణంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని పరిశుభ్రంగా, అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు.పుట్టపర్తి మునిసిపాలిటి పరిధిలోని కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో చేపడుతున్న సుందరీకరణ, పారిశుధ్య పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంగళవారం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా చిత్రావతి నదిలో క్లీనింగ్ పనులను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, మాజీ మంత్రి జేసిబి తో తొలగించే పనులను ప్రారంభించారు.చిత్రావతి నదిలో చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. నదిలోకి మురుగునీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో మురుగునీటి శుద్ధి కేంద్రం (STP) ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మురుగునీటిని శుద్ధి చేసి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే పుట్టపర్తి మున్సిపాలిటీలో మూడు మురుగు శుద్ధి కేంద్రాలు ఉన్నప్పటికీ ఇవి ఏవీ పనిచేయడం లేదన్నారు. తక్షణం ఒకటి పనిచేసేలా వాటికి రూ.50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే అవి మంజూరు అయిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి మురుగు వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. పాడైన మురుగు శుద్ధి కేంద్రాలు త్వరగా మరమ్మతులు చేపట్టే విధంగా ప్రభుత్వానికి తగిన నివేదికలు పంపాలని సూచించారు.
పుట్టపర్తిని సుందర పట్టణంగా తీర్చిదిద్దాలి పుట్టపర్తి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యంత సుందరమైన, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు.చిత్రావతి పరివాహక ప్రాంతంలో సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.చిత్రావతి నది, పరివాహక ప్రాంతం పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయడంతో పాటు, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం ఇరిగేషన్ శాఖ, మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సమీక్ష నిర్వహించారు. సుందరీకరణ, పారిశుధ్య పనుల పురోగతి, మురుగునీటి సమస్యలు, (STP) (sewage treatment plant)మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించారు.చిత్రావతి నదిని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నదిలో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సువర్ణ , పబ్లిక్ హెల్త్ డిఈ నరసింహమూర్తి ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహసిల్దార్ సంహిత ,ఇరిగేషన్ డి ఈ గంగాద్రి ,పూల గంగాధర్ జమునబాయి,శివయ్య, టిడిపి నాయకులు బోయ రామాంజనేయులు, రామారావు, లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, సాముకోటి ఆదినారాయణ , బెస్త చలపతి , ఓబులేసు దేవా ,అంబులెన్స్ రమేష్, ఉమాపతి,శ్రీరాములు,సాయి కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం మిగులు భోజనం ఏర్పాటు చేయడం మహాభాగ్యం



**- ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి**

**మార్కాపురం సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణం లో శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాసా శ్రీనివాసరెడ్డి పాలుగుళ్ల అనంతమ్మ విశ్రాంత ఉపాధ్యాయుల మనుమరాలు కాసా దాక్షిణ్యా రెడ్డి 2 వ పుట్టినరోజు సందర్భంగా మిగులు భోజనము మరియు హీరో హోండా షోరూం యజమాని శ్రీనివాసులు గృహప్రవేశంలో పంట శివమల్లారెడ్డి గృహప్రవేశంలో మిగులు భోజనము గిద్దలూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ ముందు బాగాన అన్నార్తుల కోసం సోమవారం రాత్రి ఏర్పాటు చేశామని దాదాపు 200 మందికి పైగా భోజనం చేశారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణ రెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు తెలిపారు ఎలాంటి శుభకార్యాలలో మిగిలిన భోజనాన్ని మాకు తెలియజేసినట్లయితే తప్పకుండా భోజనాన్ని వృధా కాకుండా ఆకలితో ఉన్నటువంటి ప్రజలకు ఆకలి నింపిన వారమవుతామని తెలిపారు. శ్రీ శ్రీ భగవాన్ కాశినాయన కూడా తిరుగుచున్నటువంటి సమయంలో ఎన్నో పురాతన దేవాలయాలు అభివృద్ధి చేసి అక్కడ వచ్చే భక్తులకు ఆకలితో ఇబ్బంది పడకుండా భోజనం ఏర్పాటు చేసేవారని బి యస్ నారాయణరెడ్డి తెలిపారు. మిగులు భోజనాలు ఉంటే ఈ 9441932390 నెంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరువ రమణారెడ్డి సమయం కేటాయించి అన్నం అయిపోయేంతవరకు సేవా కార్యక్రమము నిర్వహించారు మిగులు భోజనాలు ఆరగించిన ప్రజలు చాలా మంచి పని చేస్తున్నారు ఇలాంటి పని చేయడం వల్ల ఎంతోమంది మాలాంటి ఆకలిగొన్న ప్రజలకు అందుబాటులో తెచ్చి పెట్టి మా కడుపు నింపినందుకు వ్యవస్థ చేస్తున్నటువంటి ఇరువురిని అభినందిస్తూ ఆశీర్వదించారు. అన్నం మిగిలిందని తెలిపినందుకు ముగ్గురికి బి యస్ నారాయణరెడ్డి, ఏరువ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# అర్ధరాత్రి రోడ్లపై అనవసర సంచారానికి చెక్.. 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ'



**అనంతపురం, సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

జిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు 'ఆపరేషన్ నైట్ సేఫ్టీ' పేరుతో రాత్రివేళ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.అనంతపురం నగరంతో పాటు మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లు, వీధులు, రహదారుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఫుట్ పెట్రోలింగ్ చేపట్టి అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను పరిశీలించారు.అత్యవసర పనులు, ఇతర అవసరాల కోసం రాత్రివేళ ప్రయాణించే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. అదే సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలతో ప్రమాదకరంగా వాహనాలు నడపడం, రహదారులపై హారన్లు మోగిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, ప్రధాన కూడళ్ల వద్ద గుంపులుగా చేరి అనుమానాస్పదంగా సంచరించడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేశారు.రాత్రివేళల్లో ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా జిల్లావ్యాప్తంగా నిఘా, తనిఖీలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# పెన్షన్లను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం

**- కలెక్టర్ శ్యాం ప్రసాద్...**

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబరు 01 అనంత జన శక్తి న్యూస్.**

వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను పారదర్శకంగా లబ్ధిదారులకు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు.
మంగళవారం జగరాజుపల్లి ఎస్సీ కాలనీలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును అందజేశారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పింఛన్ల పంపిణీ సకాలంలో అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.జగరాజుపల్లి ఎస్సీ కాలనీలో
సత్తెనగారి సత్యమ్మ కు దివ్యాంగుల పింఛన్ సీతారామయ్య/వృద్ధాప్య పెన్షన్ మాదిగ బావక్క కు నాలుగు వేలు, రామక్క దివ్యాంగుల పింఛన్ ఆరు వేలు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకే చెందేలా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను నేరుగా అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో డిఆర్‌డిఎ పిడి నరసయ్య,మెప్మా పిడి నాగరాజు , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ వ్యవస్థ బలోపేతం ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**- తిరుపతిలో విద్యుత్ శాఖ సీఎండీని కలిసిన ఎమ్మెల్యే**
**- నూతన సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఇతర సామగ్రి కావాలని విజ్ఞప్తి**
**- సానుకూలంగా స్పందించిన సీఎండీ శివ శంకర్**

**అనంతపురం సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**



అనంతపురం నగరంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆయన తిరుపతిలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ ఎల్.శివ శంకర్ ను ఆయన కలిశారు. అనంతపురం ఉన్న సమస్యలు, అవసరాల గురించి సీఎండీకి వినతి పత్రం అందజేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో విద్యుత్ మౌళిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నగర విస్తరణ, పెరుగుతున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ డిమాండ్‌ను దృష్ట్యా నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేయాలని కోరారు. నారాయణపురం పంచాయతీ, రుద్రంపేట, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ల అవసరం ఉందన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓవర్‌లోడింగ్, వోల్టేజ్ హెచ్చుతగ్గులు వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 160 KVA సామర్థ్యం కలిగిన 20 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు, పాత విద్యుత్ స్తంభాలు, కేబుళ్లు, పాత లైన్ల స్థానంలో కొత్త లైనింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన మౌలిక వసతుల కల్పనకు అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద 33/11 KV ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు పరిపాలనా అనుమతి త్వరితగతిన మంజూరు చేయాలని సీఎండీని కోరారు. అనంతపురం నగర ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలు పరిశీలించి.. అనంతపురం ఎస్ఇకి తగిన ఆదేశాలు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ అనంతపురం అభివృద్ధిలో భాగంగా విద్యుత్ వ్యవస్థ చాలా ముఖ్యమైందన్నారు. ఇక్కడ జనాభా పెరగడమే కాకుండా పారిశ్రామికంగా కూడా విద్యుత్ అవసరం చాలా పెరిగిందన్నారు. అందుకే పెరిగిన అవసరాల దృష్ట్యా అవసరమైన వాటిని మంజూరు చేయాలని సీఎండీ కోరామన్నారు. త్వరలోనే అవి మంజూరవుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

**- మరో రూ.100 కోట్లు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**- గ్రామీణ రహదారులు, తాగు నీటి సదుపాయాల కల్పనకు నిధులు**
**- రూ.90 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో ఏడు నియోజకవర్గాల్లో రహదారుల అభివృద్ధి**
**- తాగు నీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మరో రూ.10 కోట్లు**
**- ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్లు కేటాయించిన ఉప ముఖ్యమంత్రివర్యులు**

**అమరావతి సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**



'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' అనే థీమ్‌తో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారు. గోదావరి పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం పంచాయతీరాజ్, గ్రామీణ తాగు నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల ద్వారా రూ.100 కోట్ల నిధులను విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ద్వారా విడుదల చేసిన రూ.100 కోట్లకు ఇవి అదనం.ఈ నిధులతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం ప్రాంతాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో రూ. 90 కోట్లతో 111 పనులను చేపట్టనున్నారు. వీటి ద్వారా సుమారు 141 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రహదారుల నిర్మాణం చేపడతారు. రూ.10 కోట్లతో.. పుష్కరాలకు వచ్చే భక్తులకు రక్షిత తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రాజోలు, పి. గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో బీటీ, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. అవసరమైన చోట గ్రామాల్లో అంతర్గత రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు. గోదావరి పుష్కరాలను కేవలం రాజమహేంద్రవరం వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితం చేయకుండా, పవిత్ర నదీ పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామంలో భక్తులు పుష్కర స్నానాలు, పూజలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నారు.

**ప్రతి పుష్కర ఘాట్‌లో రక్షిత తాగు నీటి సదుపాయాలు**

గ్రామీణ రహదారులతో పాటు ప్రతి పుష్కర ఘాట్ లో రక్షిత తాగు నీటి సరఫరా బాధ్యతలను కూడా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ద్వారా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే శ్రీ పవన్ కళ్యాణ్ గారు రూ.7 కోట్ల వ్యయంతో రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మునికూడలిని 'మోడల్ పుష్కర పంచాయతీ'గా అభివృద్ధి చేస్తున్నారు. సప్త ఋషి ఘాట్‌కు సకల హంగులు కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో సీసీ రహదారుల నిర్మాణం, టవర్ లైట్ల ఏర్పాటు, మునికూడలి గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పుష్కర ఘాట్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు పూర్తికావస్తున్నాయి.

**ఏపీపీసీబీ నిధులతో సమగ్ర అభివృద్ధి**

కాలుష్య నియంత్రణ మండలి ద్వారా కేటాయించిన రూ.100 కోట్లను ఆయా జిల్లాల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో వినియోగించనున్నారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను వినియోగించి గోదావరి పుష్కరాలను మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

# గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి.

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 01 అనంత జన శక్తి న్యూస్.**

పుట్టపర్తి మండల పరిధిలోని పై పల్లి హరిజనవాడకు చెందిన ఓ సూరప్ప 73 ఉపాధి పనులకు వెళ్లి గుండెపోటుతో మరణించారు. మంగళవారం పై పల్లి గ్రామంలో ముమ్మినేని కేశప్ప పొలంలో మామిడి చెట్లు కు ఉపాధి పనుల ద్వారా గుంతలు తీస్తున్నారు. ఈ పనుల నిమిత్తమై ఉదయం ఏడు గంటలకు యధావిధిగా పనులకు వెళ్లారు. ఈ తరుణంలో, ఓసూర ప్ప పనులు చేస్తు, ఉన్నట్టుండి కుప్పకూలి పడిపోయాడు. గమనించిన తోటి ఉపాధి కూలీలు, ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మరణించి నట్లు ధ్రువీకరించారు. సంఘటన స్థలాన్ని ఉపాధి హామీ ఏపీ ఓ వరప్రసాద్ ,సిబ్బంది పరిశీలించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఉపాధి కూలీలు, గ్రామస్తులు కోరారు.



# జిల్లా కలెక్టర్లకు రెడ్ క్రాస్ అవార్డులను అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్




**విజయవాడ, సెప్టెంబర్ 01:అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్ అబ్దుల్ నజీర్ మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఐఆర్‌సీఎస్ 202425 వార్షిక సర్వసభ్య సమావేశంలో బాపట్ల, కృష్ణా, నెల్లూరు, కాకినాడ, పశ్చిమగోదావరి, నంద్యాల, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లకు రెడ్‌క్రాస్ అవార్డులను అందజేశారు.
రెడ్‌క్రాస్ యొక్క వివిధ ప్రధాన మానవతా సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు వనరులను సమీకరించడంలోనూ విశిష్ట సహకారం అందించినందుకు జిల్లా కలెక్టర్లను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు. రెడ్‌క్రాస్ అవార్డులు పొందిన ఇతర సంస్థలను, అధికారులను కూడా గవర్నర్ అభినందించారు. సిఎస్ ఆర్ కింద వనరులను పెంచడంలో మరియు అవసరమైన వారికి ప్రయోజనం చేకూర్చే నిర్దిష్ట ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో వారి అత్యుత్తమ సహకారాన్ని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తలసేమియా రోగులకు ఆరోగ్య సంరక్షణ అందించేందుకు సంకల్ప్ ఫౌండేషన్, రోటరీ ఇంటర్నేషనల్‌తో పాటు ఎల్ఎన్4 టాంజియన్స్ ఆర్గనైజేషన్, నిరుపేదలకు కృత్రిమ చేతులను అందించడంలోను, ఎల్వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కార్నియా కలెక్షన్ కోసం ఎల్వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లాకోటిక్ యాంటిఎన్ఇఎ) కోసం సంకల్ప్ ఫౌండేషన్ సహకారం, డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కోసం యువతలో చైతన్యం తీసుకురావడానికి రెడ్ క్రాస్ కృషిని అభినందించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, నంద్యాల, పల్నాడు, తిరుపతి, అంబేద్కర్ కోనసీమ ఇంకా పశ్చిమ గోదావరి మొదలగు ఏడు జిల్లాల పరిధిలో మూడేళ్లుగా రూ.8.50 కోట్లతో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ వారి సహకారంతో 'మీ ఇంటికి మీ డాక్టర్' పథకం కింద 5 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని రెడ్‌క్రాస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.
దేశ జనాభాలో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది యువత ఉన్నందున, భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్యం జరుపుకునే సమయానికి విక్షిత్ భారత్ మరియు స్వర్ణ ఆంధ్ర @2047ని నిర్మించడంలో వారు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలలు/విశ్వవిద్యాలయాలలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని, అకడమిక్ పాఠ్యాంశాల్లో రెడ్‌క్రాస్‌ను అనుసంధానం చేయాలని, యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలిచేందుకు జిల్లా కలెక్టర్ల సహాయాన్ని కోరాలని గవర్నర్ రాష్ట్రంలోని రాష్ట్ర, కేంద్రీయ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను కోరారు.
రెడ్‌క్రాస్ ప్రారంభించిన ఏపీ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ మరియు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వ్యతిరేక క్యాంపెయిన్‌లో రెడ్‌క్రాస్ వాలంటీర్లు మరియు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి & ముఖ్య కార్యనిర్వహణాధికారి అశ్విని కుమార్ పరిదా, యం.డి. రామారావు, చైర్మన్ పి.రామచంద్రరాజు, వైస్ చైర్మన్, డాక్టర్ డి.శ్రీహరిరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏ.పి. రాష్ట్ర శాఖ కోశాధికారి, ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నార

# టెక్కలి అభివృద్ధికి భారీ ప్రణాళికలు

**- 2028 నాటికి ప్రతి ఇంటికీ శుద్ధ జలాలు.. 2029 నాటికి సమగ్ర అభివృద్ధి**
**- అర్హులైన ప్రతి కుటుంబానికి పింఛన్.. ఈ నెల నుంచే కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ**
**- ఇజ్జువరంలో 'పేదల సేవలో' కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు**

**సంతబొమ్మాళి, సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**




అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పిస్తూ పింఛన్ అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను స్వయంగా అందజేశారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్ఎంబీటీ రోడ్డు వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, రక్షణ గోడ, కాలువలు, పైపుల కల్వర్టు నిర్మాణాలను మంత్రి ప్రారంభించారు.

**అర్హులైన వారికి కొత్త పింఛన్లు**

ఈ నెల నుంచి భర్తను కోల్పోయిన వితంతువులు, దివ్యాంగులు, గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు తొలగించబడిన అర్హులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న వారికి అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పింఛన్ ప్రయోజనానికి దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

**పెట్టుబడులకు రాష్ట్రం గమ్యస్థానం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని అచ్చెన్నాయుడు తెలిపారు. గత 24 నెలల్లో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సుమారు రూ.24 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

**ప్రతి రైతుకు మూడు పంటలకు సాగునీరు**

ప్రతి రైతు ఏడాదికి మూడు పంటలు పండించేలా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణంతో 19 టీఎంసీల నీటిని నిల్వ చేసి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మరో రెండేళ్లలో బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యేలా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారని చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చామని, తద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని వివరించారు.

**టెక్కలి నియోజకవర్గానికి మహర్దశ**

టెక్కలి నియోజకవర్గంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో 10 రైల్వే పైవంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు2029 నాటికి రాజకీయాలకు అతీతంగా టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

**2028 నాటికి ప్రతి ఇంటికీ శుద్ధ జలం**

టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 2028 నాటికి మంచినీటి పథకం ట్యాంకు నిర్మించి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరుస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**45 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.50 కోట్లు**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషితో నరసన్నపేట నుంచి పోలాకి, పిన్నింటిపేట, బోరుభద్ర, నౌపడ మీదుగా వెంకటాపురం వరకు సుమారు 45 కిలోమీటర్ల రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. త్వరలోనే పనులకు శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని చెప్పారు.ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతూ టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం. సుధాకర్‌రావు,హేమసుందర్‌రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారి ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అవ్వాతాతల కళ్లలో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉంది

**- మంత్రి నారాయణ**
**- నెల్లూరులో వేడుకలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ.**
**- 6వ డివిజన్‌లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేసిన మంత్రి నారాయణ**
**- ఏటా పింఛన్ల కోసం 33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం-మంత్రి నారాయణ .**

**నెల్లూరు:మంగళవారం:01, అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరులోని 6వ డివిజన్ ఉడ్ హౌస్ సంఘంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ వేడుకలా సాగింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ నగదు అందజేసారు.వారి యోగక్షేమాలతో పాటు సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఒకే ఇంటికి పింఛను, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, నారాయణ సైకిల్ అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.స్థానిక మహిళలు మంగళహారతులతో మంత్రికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అస్తవ్యస్త పాలనతో వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివెళ్లిందని విమర్శించారు.పెన్షన్ పెంచుతామని మోసం చేసిందన్నారు.పెన్షన్ ఏడాదికి 250 చొప్పున వాయిదాల పద్ధతిలో పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల బకాయిలతో పాటు వృద్ధులు, వితంతువుల పింఛన్లను ఒకేసారి 4,000కు, దివ్యాంగులకు 6,000కు, పూర్తి వికలాంగులకు 15,000కు, కిడ్నీ, కాలేయ వ్యాధిగ్రస్తులకు 10,000కు పెంచి క్రమం తప్పకుండా 1వ తేదీనే
ఇంటి వద్దకే అందిస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 62 లక్షల కుటుంబాల కోసం ఏటా 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు పింఛన్ల కోసం 73,594.44 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మనరాష్ట్రంతో పోల్చుకుంటే పొరుగు రాష్ట్రాలు సగం కూడా పింఛన్ ఇవ్వటం లేదని గుర్తుచేశాడు. తెలంగాణలో 2016 రూపాయలు,తమిళనాడులో వెయ్యి రూపాయలు,కర్ణాటకలో 600 మాత్రమే పెన్షన్ ఇస్తున్నారన్నారు.సీఎం చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమం,అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.
2019లో మంజూరైన వేల కోట్ల కేంద్ర నిధులకు గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో నిధులు వెనక్కి పోయి పనులు ఆగిపోయాయన్నారు .ఆ పనులన్నీ తిరిగి ప్రారంభించామన్నారు.సీఎం చంద్రబాబు, డీసీఎం
పవన్ కళ్యాణ్, యువనేత లోకేష్ కృషి వల్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్,
మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, నాయకులు కొండా ప్రవీణ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాలచర్లలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**రాప్తాడు సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు మండలం పాలచర్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ హిందూపురం పార్లమెంట్ అధికారి ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్పతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితర లబ్ధిదారుల ఇళ్లకు తెల్లవారుజామునే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ముత్యాలప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.



# సీసీ రోడ్డు,జెట్టింగ్ మిషన్ వాహనాలు ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 46వ డివిజన్ జొన్నలగడ్డవారి వీధిలో రూ.28.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించారు.అనంతరం కార్పొరేషన్ రూ.1.20 కోట్లతో కొనుగోలు చేసిన రెండు యూడీజీ జెట్టింగ్ మిషన్ వాహనాలను కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానికులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లోనే రోడ్డు పనులు పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మూడు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించినందుకు వ్యాపారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసిన అధికారులను అభినందించారు. నెల్లూరు సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.2014-15లో రూ.550 కోట్లతో యూడీజీ పనులు ప్రారంభించామని, మరో రూ.550 కోట్లతో సంగం బ్యారేజీ నుంచి తాగునీటి ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. 90 శాతం పూర్తయిన ఈ పనులను గత ప్రభుత్వం నిలిపివేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి పనులు ప్రారంభించామని త్వరలో పూర్తి చేస్తామన్నారు.13వ డివిజన్‌లో మరో రూ.250 కోట్లతో యూడీజీ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. నెల్లూరును దోమల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలు యూడీజీ కనెక్షన్లు తీసుకుని సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ లక్ష్యాన్ని సాధించగలమన్నారు.యూడీజీ కనెక్షన్ రుసుమును రూ.10 వేల నుంచి రూపాయికి తగ్గించినట్లు మంత్రి వివరించారు. నెలకు రూ.1,000లోపు పన్ను చెల్లించే వారికి ఉచితంగా కనెక్షన్ ఇస్తామని, రూ.2,000లోపు పన్ను చెల్లించే వారికి 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. రూ.2,000కు పైగా పన్ను చెల్లించే వారు పూర్తి రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. కనెక్షన్ రుసుమును ఐదేళ్లలో పది వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పించామని చెప్పారు.నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని రెండు లక్షల కుటుంబాలు యూడీజీ కనెక్షన్లు తీసుకోవాలని మంత్రి సూచించారు. అమెరికా, రష్యా, చైనా, జపాన్ వంటి దేశాలు 100 శాతం యూడీజీ వ్యవస్థతో దోమల సమస్యను నియంత్రించాయని పేర్కొన్నారు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, డివిజన్ నాయకులు పుట్టా అజయ్, కోకు మహేంద్రరెడ్డి, సత్యనాగేశ్వరరావు, డాక్టర్ పోకల రవి తదితరులు పాల్గొన్నారు.

# డ్యూటీకి దూరం... విధులకు పంగనామం !

- **కొట్టాలపల్లి కార్యదర్శి ఇష్టారాజ్యం**
- **గుంతకల్లు పట్టణంలో నివాసం**
- **ఏ సమస్య విన్నవించాలన్నా గుంతకల్లుకు వెళ్ళాల్సిందే**
- **గ్రామంలో సమస్యల రాజ్యం**
- **వర్షా కాలంలో ప్రబలిన వ్యాధులు, జ్వరాలు-**

**ఉవకొండ, సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అరవింద్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. "మోనార్క్" అన్న విధంగా ప్రవర్తిస్తున్నారు. డ్యూటీ గురించి ప్రశ్నించిన వారిపై మీరేంటి చెప్పేది ? అంటూ ప్రజలపై విరుచుకుపడుతున్నారు. వారానికి కనీసం ఒక్క రోజు కూడా విధులకు హాజరు కావడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో కొట్టాలపల్లి పంచాయతీ పరిధిలో సమస్యలు రాజ్య మేలుతున్నాయి. మురుగు, రోడ్లు, తాగు నీరు, వైద్యం, శాంతి భద్రతలు... అన్నీ సమస్యలే.

**యథా రాజా తథా సిబ్బంది!**

కొట్టాలపల్లి పంచాయతీ కార్యాలయంలో మొత్తం తొమ్మిది మంది సిబ్బంది ఉన్నారు. ఏ ఒక్కరూ విధులకు సరిగా హాజరు కావడం లేదు. డ్యూటీ సమయంలో వంతుల వారీగా రోజుకు ఒకరు మాత్రమే విధులకు హాజరు అవుతున్నట్లు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం పంచాయతీ కార్యదర్శి అరవింద్ నిర్లక్ష్య వైఖరితోపాటు సరిగా విధులకు హాజరు కాకపోవడమేనని తెలుస్తోంది. అయితే కార్యాలయ రికార్డుల్లో మాత్రం సిబ్బంది సక్రమంగా హాజరు అవుతున్నట్లు చూపుతున్నారు. కొట్టాలపల్లి పంచాయతీ పరిధిలో సుమారు వెయ్యి ఇండ్లు ఉండగా దాదాపు 5 వేల మంది నివసిస్తున్నారు. గ్రామంలో రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో ఉండడంతో ఏ సమస్య వచ్చినా నియోజకవర్గ కేంద్రం ఉరవకొండకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు తొమ్మిది కిలోమీటర్ల మేర మట్టి, కంకర రోడ్లు ఉన్నాయి. ఏ చిన్న పాటి వర్షం వచ్చినా గ్రామమంతా బురద మయంగా మారుతోంది. దోమలు, ఈగలు, పురుగు, పుట్రా పెరిగి పోతోంది. దీంతో వ్యాధులు, రోగాలు, జ్వరాలు ప్రబలి పోతున్నాయి. మురికి కాలువలు అసలు లేనే లేవు. పంచాయతీ అధికారులు బ్లీచింగ్ పౌడర్, సున్నం తదితరాలు ఏదీ చల్లిన పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది సిటిజన్ చార్ట్ పాటించడం లేదు. అదే సమయంలో గ్రామంలో ఏ చిన్న ఇంటి నిర్మాణం చేపట్టాలన్న సకాలంలో అనుమతి లభించడం లేదు. గ్రామంలో ప్రభుత్వ పాలన స్తంభించి పోయింది. ఈ సమస్యలు అన్నిటికి గ్రామ పంచాయతీ కార్యదర్శి అరవింద్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో అవినీతి పెచ్చు మీరిపోవడమేనన్న ఆరోపణలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి.



**ఉదయం 11.30 గంటల సమయం అవుతున్నా హాజరు కాని కొట్టాలపల్లి పంచాయతీ సిబ్బంది**

# రాప్తాడు నియోజకవర్గంలో 42చెరువులకు నీరు ఇవ్వండి

- **ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి**
- **పేరూరు కాలువకు భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలన్న సునీత**
- **తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్న ఎమ్మెల్యే సునీత**

**అనంతపురం సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ పరిధిలో ఉన్న 42చెరువులకు నీరు ఇవ్వాలని ఐఏబీ సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురం కలెక్టరేట్ లో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆమె జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యలను ఐఏబీ సమావేశంలో అధికారులు, మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం హంద్రీనీవా నుంచి వచ్చే నీరు గొల్లపల్లి రిజర్వాయర్ కు ఇచ్చిన తర్వాత అత్యధికంగా ఆధారపడ్డ మా నియోజకవర్గంలోని 42చెరువులకు నీరు ఇవ్వాలన్నారు. ఇప్పటికే వర్షాలు సరిగా లేక భూగర్భజలాలు అడుగంటి పోయాయన్నారు. వెయ్యి అడుగులు బోరు వేసినా నీరు దొరకడం లేదన్నారు. ఇలాంటి సమయంలో చెరువులకు నీరు ఇవ్వకపోతే.. ప్రజలకు, పశువులకు త్రాగునీటి సమస్య ఏర్పడడంతో పాటు పశువులకు పశుగ్రాసం కూడా ఉండదన్నారు. మరోవైపు పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర సాగునీటి కాలువ కోసం ఎంతో మంది రైతులు మాతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో భూములిచ్చారన్నారు. ఇప్పటికే పనులు కూడా సాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. అది కూడా త్వరగా ఇవ్వాలని మంత్రి పయ్యావులకు విజ్ఞప్తి చేశారు. పీఏబిఆర్ కుడి కాలువ పరిధిలో 49చెరువులు ఉన్నాయని.. ఇందులో రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లోని చెరువులకు ఎప్పుడూ తక్కువ నీరు వస్తోందన్నారు. ఈసారి కనీసం కొంతమేర అయినా నీరు ఇస్తే.. భూగర్భజలాలు వృద్ధిచెంది, తాగునీటికి సమస్య లేకుండా ఉంటుందన్నారు. అనంతపురం రూరల్ మండలం జిల్లాలో చాలా పెద్దదని.. ఇక్కడ అనేక కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే పరిస్థితి ఉందన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేశారన్నారు. ఈ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ను ఎమ్మెల్యే సునీత కోరారు...






# చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

- **యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెట్ రద్దు చేయాలి.**
- **యుటిఎఫ్ నాయకులు.**

**ధర్మవరం సెప్టెంబర్ 1, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మవరం డివిజన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగే టెట్ రద్దు కోసం చలో విజయవాడ పోస్టర్లను యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్ మరియు జిల్లా కార్యదర్శి పి అమర్ నారాయణరెడ్డి , రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి మాట్లాడుతూ.... ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన టెట్ నిర్వహిస్తామని సంఘాలు డిమాండ్ చేస్తే ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసింది కానీ అందులో ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు అని ఉంది కానీ సాధారణ టెట్కు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల టెట్కు ఏ మాత్రం తేడా లేదని ఉపాధ్యాయుల ఆకాంక్ష మేరకు మార్కులు తగ్గించలేదని ఆఫ్లైన్లో కూడా నిర్వహించడం లేదని తెలియజేశారు.ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతుల కొరకు నిర్వహించే డిపార్ట్మెంట్ ఎగ్జామ్స్ మాదిరిగా క్వాలిఫై మార్క్స్ కమ్యూనిటీ వారీగా కాకుండా అందరికీ ఒకేలా 40 శాతం ఉండాలని డిమాండ్ చేశారు.విద్యాహక్కు చట్టం సెక్షన్ 23 (1) సవరణ చేసేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి అని, ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షలలో అర్హత మార్కులు తగ్గించాలి అని ఉపాధ్యాయుల కోరిక మేరకు పరీక్ష ఆఫ్లైన్లో నిర్వహించాలి అని తెలిపారు. ఉపాధ్యాయులకు వారు బోధిస్తున్న సబ్జెక్టులలో మాత్రమే పరీక్ష నిర్వహించాలి అని డిమాండ్ చేశారు. పై డిమాండ్స్ తో సెప్టెంబర్ మూడవ తేదీ గురువారం విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం కోసం ధర్మవరం జోన్ నందలి నాయకులు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి ధర్మవరం డివిజన్ నాయకులు జింక హరికృష్ణ, రామాంజనేయులు, ఆంజనేయులు, వెంకట కిషోర్, నాగిరెడ్డి ,రవి శేఖర్, పూజారి రామకృష్ణ ఆదిశేషయ్య, సాయి గణేష్, గోపాల్ రావు ,శివారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# నెల రోజుల్లో కొత్త పింఛన్లు



- **అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం..**
- **ఇచ్చిన మాటకు కట్టుబడిన చంద్రబాబు ప్రభుత్వం....**
- **ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్.....**

**ధర్మవరం సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

ధర్మవరం అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్న వారికి త్వరలో శుభవార్త అందనుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. నెల రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ధర్మవరం పట్టణంలోని 28వ వార్డు ఇందిరమ్మ కాలనీలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్ ఇంటి వద్దకు అందుతున్నదా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్ పంపిణీ విధానంపై పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచి అందిస్తున్నారని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే తలుపు తట్టి పింఛన్ అందించడం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని చెప్పారు. అయితే అర్హత ఉన్నప్పటికీ ఇంకా పింఛన్లు అందని వారు చాలామంది ఉన్నారని, అలాంటి వారందరికీ నిబంధనల ప్రకారం నెల రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పింఛన్లతో పాటు తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సాయం, చేనేతలకు ఉచిత విద్యుత్, నేతన్న సేవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పలు హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని శ్రీరామ్ వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు రాజీపడటం లేదన్నారు. చేనేత కార్మికులకు అమలు చేస్తున్న నేతన్న సేవ పథకంలో ఇప్పటికే చాలామందికి ఆర్థిక సాయం అందిందని, వివిధ కారణాలతో ఇప్పటివరకు అందని అర్హులకు కూడా త్వరలోనే ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విమర్శలు చేసిన వారిలో కొందరికి కూడా ఆర్థిక సాయం అందిందని శ్రీరామ్ పేర్కొన్నారు.

# 5 నెలలుగా జీతాల్లేవు



**కార్మికుల గోడు విన్న హరీశ్ బాబు...**
**వాటర్ సప్లయి స్కీమ్ వర్కర్స్ సమస్య పై తక్షణ స్పందన....**

**ధర్మవరం సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ఐదు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీ సత్యసాయి వాటర్ సప్లయి స్కీమ్ కార్మికులకు అండగా నిలిచారు మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు. తమ కు నెలల తరబడి వేతనాలు అందడం లేదని, కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆయనను కలిసి తమ సమస్యను వివరించారు. కార్మికుల సమస్యను సానుకూలంగా విన్న హరీశ్ బాబు వెంటనే స్పందించారు. జిల్లా పరిషత్ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపుపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఈ సమస్యను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి, పైస్థాయి అధికారులతో మాట్లాడి కార్మికులకు రావాల్సిన జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని హరీశ్ బాబు హామీ ఇచ్చారు. “కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. మీ సమస్య పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటాం” అని హరీశ్ బాబు భరోసా ఇచ్చారు. దీంతో తమ సమస్యపై తక్షణమే స్పందించి అధికారులతో మాట్లాడిన హరీశ్ బాబుకు వాటర్ సప్లయి స్కీమ్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మరో 15 ఏళ్లపాటు కూటమి పాలన ఉంటుంది

- **తిరుమలలో శ్రీవారి దర్శనం సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి**
- **నూతన ఎమ్మెల్సీ రమాదేవితో కలిసి స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

**తిరుమల సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మరో 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, బంధుమిత్రులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విఐపి బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అయ్యాక రమాదేవితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నామన్నారు. స్వామి కృపాకటాక్షాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తో పాటు రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆయన కోరుకున్నారు. గత రెండేళ్లుగా కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని.. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.



# సయోధ్య కుదిరేనా...??



-సంస్థాగత ఎన్నికలకు ధర్మవరంలో కూటమి సరైన ఐక్యతతో జత కట్టేనా?
-సీట్ల పంపకాలలో సఖ్యతతో... సంతృప్తి చెందేరా...? తేడా వచ్చేనా?
-కూటమి ఆశావహులు స్వతంత్ర జండా పట్టేరా...?
-కూటమిలో చైర్మన్ అభ్యర్థి ఎవరు? పట్టణ ప్రజల్లో నాయకులలో కార్యకర్తలలో హై టెన్షన్..?
-మంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఎడమొఖం, పెడ మొఖం తో సాగేరా? ఐక్యతతో ముందుకు నడిచే రా?
-జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి అందరివాడు.
-ఎన్నికల బరిలో మేము సైతం అంటూ వరదాపురం సూరి అనుచరులు.

**ధర్మవరం రాజకీయాల్లో సంస్థాగత ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కూటమి పార్టీల మధ్య ఐక్యతపై కొత్త చర్చ మొదలైంది. బయటకు మాత్రం అంతా కలిసి ఉన్నామనే సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ... లోపల మాత్రం పదవులు, సీట్లు, చైర్మన్ అభ్యర్థిత్వం చుట్టూ ఆశావహుల లెక్కలు వేరేలా సాగుతున్నాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. సయోధ్య కుదిరిందా...? లేక ఎన్నికల వరకు మాత్రమే కలిసి నడిచే రాజకీయ సర్దుబాటా...? అన్న ప్రశ్న ఇప్పుడు ధర్మవరం కూటమి కార్యకర్తల మధ్య హాట్ టాపిక్ గా మారింది.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,**
**సెప్టెంబర్ 1, అనంత జనశక్తి న్యూస్:**

సంస్థాగత ఎన్నికల్లో సీట్ల పంపకం అత్యంత కీలకంగా మారనుంది. టిడిపి, బిజెపి, జనసేన పార్టీల మధ్య స్థానాల కేటాయింపు ఏ ప్రాతిపదికన జరుగుతుంది? ఎవరికి ఎంత ప్రాధాన్యత లభిస్తుంది? గత ఎన్నికల్లో పనిచేసిన వారికి అవకాశాలు దక్కుతాయా? లేక కొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయా? అనే ప్రశ్నలు ఆశావహులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒక్కో సీటు కోసం ఒక్కో ఆశావహుడు రంగంలోకి దిగితే... కూటమి ఐక్యతకు పరీక్ష తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీట్ల పంపకంలో అందరికీ సంతృప్తి కలిగించడం నాయకత్వానికి అంత తేలికైన విషయం కాదు. ఒకరికి అవకాశం దక్కితే మరొకరు అసంతృప్తికి గురయ్యే పరిస్థితి ఏర్పడవచ్చు. ఆ అసంతృప్తి చివరకు తిరుగుబాటుకు దారితీస్తుందా? కూటమి ఆశావహులు స్వతంత్ర జెండా పట్టుకుని బరిలోకి దిగుతారా? అనే సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పార్టీ కోసం ఏళ్ల తరబడి పని చేశామని భావించే నాయకులకు సరైన గుర్తింపు లేకపోతే వారి తదుపరి అడుగు ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది.



**చైర్మన్ అభ్యర్థి ఎవరు...?**

ధర్మవరం పట్టణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత చర్చనీయాంశంగా మారిన అంశం చైర్మన్ అభ్యర్థిత్వమే . కూటమి తరపున ఆ పదవి ఎవరి పేరు ఖరారు అవుతుంది? టిడిపి నాయకుడికే అవకాశం వస్తుందా? లేక మిత్రపక్షాలకు ప్రాధాన్యత కల్పిస్తారా? అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు నాయకులు తమ తమ రాజకీయ లెక్కలతో ముందుకు సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. చైర్మన్ కుర్చీ ఒకటే... ఆశావహులు మాత్రం అనేకం కావడంతో పట్టణ రాజకీయాల్లో హై టెన్షన్ నెలకొంది. అయితే కూటమి విజయానికి ప్రధాన అస్త్రం ఐక్యతేనని పట్టణ ప్రజలు, రాజకీయ నాయకులు అభిప్రాయపడుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం లేకుండా, కార్యకర్తల్లో నమ్మకం పెంచకుండా ఎన్నికల బరిలోకి దిగితే ప్రత్యర్థుల కు అవకాశాలు పెరుగుతాయని అంటున్నారు. అందుకే సీట్ల పంపకం నుంచి చైర్మన్ ఎంపిక వరకు ప్రతి నిర్ణయం సమిష్టిగా తీసుకోవలసిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

**.కూటమిలో అందరివాడు గా చిలకం మధుసూదన్ రెడ్డి...!**

**మంత్రి సత్య కుమార్ యాదవ్ తో సఖ్యత... పరిటాల శ్రీరామ్ తో సమన్వయం....!**

ధర్మవరం రాజకీయాలలో జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి వ్యవహార శైలి ప్రస్తుతం కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య చర్చనీయాంశంగా మారుతోంది. కూటమి రాజకీయాలలో సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తూ, అన్ని వర్గాల నాయకులతో సఖ్యతగా ముందుకు సాగుతున్న ఆయన తీరు ప్రత్యేకంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గానికి వచ్చిన ప్రతి ముఖ్య కార్యక్రమంలో పాల్గొంటూ, ప్రభుత్వ కార్యక్రమాలు మరియు కూటమి కార్యకలాపాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని నాయకులు పేర్కొంటున్నారు. అదే సమయంలో ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తో కూడా సఖ్యతగా వ్యవహరిస్తూ కూటమి ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. పార్టీల మధ్య రాజకీయంగా వేరువేరు గుర్తింపులు ఉన్నప్పటికీ, కూటమి ఉమ్మడి లక్ష్యాల కోసం నాయకులంతా కలసి పనిచేయాల్సిన అవసరం ఉందన్న భావనతో చిలకం మధుసూదన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యక్రమాలలో పాల్గొనడం, పరిటాల శ్రీరామ్తో కలసి కూటమి కార్యక్రమాలలో కనిపించడం ద్వారా ధర్మవరం రాజకీయాల్లో ఆయన అందరిని కలుపుకొని వెళ్లే నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారన్న చర్చ సాగుతోంది. మొత్తంగా ధర్మవరం కూటమిలో సమన్వయం, సఖ్యతకు ప్రాధాన్యత ఇస్తూ జనసేన తరపున చిలకం మధుసూదన్ రెడ్డి చురుకుగా వ్యవహరిస్తుండటం రాజకీయ వర్గాలలో ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో కూటమి కార్యక్రమాలలో ఆయన పాత్ర మరింత కీలకంగా ఉండే అవకాశం ఉందన్న అభిప్రాయం నాయకులు, కార్యకర్తల మధ్య వినిపిస్తోంది.

**సయోధ్య మాటల్లోనా.... చేతుల్లోనా....?**

మొత్తానికి ధర్మవరం కూటమి రాజకీయాలు ఇప్పుడు కీలక మలుపు వద్ద నిలిచాయి. సీట్ల పంపకంలో సఖ్యత సాధిస్తారా? ఆశావహులు అసంతృప్తిని చల్లారుస్తారా? స్వతంత్ర పోటీకి సిద్ధమయ్యే వారిని బుజ్జగిస్తారా? చైర్మన్ అభ్యర్థిని ఏకాభిప్రాయంతో ఎంపిక చేస్తారా? ముఖ్యంగా కీలక నాయకులు తమ మధ్య ఉన్న రాజకీయ దూరాలను పక్కనపెట్టి నిజమైన ఐక్యతతో ముందుకు సాగుతారా? అన్న ప్రశ్నలకు సమాధానం సంస్థాగత ఎన్నికల నాటికి స్పష్టమవనుంది. సయోధ్య కుదిరిందనే మాట చెప్పడం కంటే... సయోధ్యను చేతుల్లో చూపించడమే ఇప్పుడు కూటమి నాయకత్వానికి అసలైన సవాల్. నాయకులంతా ఒకే తాటిపైకి వస్తే ధర్మవరంలో కూటమి రాజకీయంగా బలమైన శక్తిగా నిలుస్తుంది. కానీ పదవుల కోసం పోటీ, సీట్ల కోసం పట్టుబట్టడం, వ్యక్తిగత ఆధిపత్య పోరు పెరిగితే మాత్రం కూటమి ఐక్యతకు పగుళ్లు, తప్పవని రాజకీయ హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ధర్మవరం ప్రజలు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నది ఒక్కటే..... కూటమి నిజంగా జత కడుతుందా....? లేక ఎన్నికల వేడి పెరిగే కొద్దీ అంతర్గత రాజకీయాల మంటలు బయటపడతాయా...? వేచి చూడాలి.

**ఎన్నికల బరిలో మేము సైతం... వరదాపురం సూరి అనుచరులు.**

సంస్థాగత ఎన్నికల వేడి, రాజకీయ సమీకరణాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో మేము సైతం అంటూ... మా బలాన్ని ఎవరు తక్కువ అంచనా వేయవద్దు అంటూ వరదాపురం సూరి అనుచరులు చేస్తున్న ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాలలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇంతకాలం తమ వర్గాన్ని పక్కన పెట్టి రాజకీయ నిర్ణయాలు తీసుకుంటే ఇకపై చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదన్న సంకేతాలను వారు బలంగా పంపుతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే తమ అవసరం గుర్తుకు రావటం, నిర్ణయాల సమయంలో మాత్రం తమను విస్మరించడం సరికాదని సూరి వర్గం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ వర్గానికి తగిన ప్రాధాన్యం, గౌరవం దక్కాల్సిందేనని పట్టుబడుతున్నారు. తమ రాజకీయ భవిష్యత్ పై తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. మా వెనుక ఉన్న కార్యకర్తల బలం, ప్రజల ఆదరణ మా అసలు అస్త్రం... ఎన్నికల బరిలో నిలిస్తే ఎవరి సత్తా ఎంతుందో తేలిపోతుంది అంటూ అనుచరులు చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. అవసరమైతే స్వతంత్రంగా నైనా తమ సొంత బలంతో నైనా ఎన్నికల రంగంలో అడుగు పెట్టేందుకు సిద్ధమనే సంకేతాలు ఇవ్వడం గమనాహర్హం. ఇప్పటికే స్థానిక ఎన్నికలపై ఆశావహుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో వరదాపురం సూరి అనుచరుల వైఖరి కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల బరిలోనే మా బలం చూపిస్తాం అన్న వరదాపురం సూరి వర్గం హెచ్చరిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

**సత్య కుమార్ యాదవ్... పరిటాల శ్రీరామ్ మధ్య సమన్వయం ఎలా...?**

**పట్టణ రాజకీయ సమీకరణాలలో మంత్రి సత్య కుమార్ యాదవ్, టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పాత్రలు అత్యంత కీలకం కానున్నాయి. ఇద్దరూ కీలక నాయకులు ఒకే లక్ష్యంతో ఒకే వ్యూహం తో ముందుకు సాగితే కూటమి బలం మరింత పెరుగుతుందనే అభిప్రాయం ఉంది. కానీ నాయకత్వ స్థాయిలో పూర్తిస్థాయి సమన్వయం ఏర్పడుతుందా? ఎడ మొఖం... పెడ ముఖం గా కనిపిస్తున్నారనే ప్రచారానికి తెర పడుతుందా? లేక ఆ రాజకీయ దూరం అలాగే కొనసాగుతుందా? అన్న చర్చ కూడా కొనసాగుతోంది. సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఈ ఇద్దరు నాయకులు ఒకే వేదికపై, ఒకే నిర్ణయంతో కార్యకర్తలకు స్పష్టమైన దిశా నిర్దేశం చేస్తే కూటమిలోని అనేక సందేహాలకు తెరపడే అవకాశం ఉంది. వ్యక్తిగత రాజకీయ లెక్కల కంటే కూటమి విజయమే ముఖ్యమనే సందేశాన్ని బలంగా పంపించాల్సిన సమయం ఆసన్నమైందని కార్యకర్తలు భావిస్తున్నారు. నాయకుల మధ్య చిన్నపాటి విభేదాలే క్రింది స్థాయి వరకు చేరితే అవి ఎన్నికల సమయంలో పెద్ద రాజకీయ చిచ్చుగా మారే ప్రమాదం లేకపోలేదు**









# నిడదవోలులో రూ.14.97 కోట్లతో 33,990 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ :మంత్రి కందుల దుర్గేష్

- త్వరలోనే అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు నూతన పెన్షన్లు మంజూరు

**నిడదవోలు సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం త్వరలోనే వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన నూతన పెన్షన్ల మంజూరుకు కట్టుబడి ఉందని, సెప్టెంబర్ నెలాఖరు లేదా అక్టోబర్ నాటికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సకాలంలో సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం నిడదవోలు పట్టణంలో 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ నీటి విడుదల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా నంద్యాల నుండి నిడదవోలు చేరుకుని పట్టణంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా 4,081 మంది లబ్ధిదారులకు రూ.1.83 కోట్లు పెన్షన్ నగదు పంపిణీ చేశారు. నిడదవోలు నియోజకవర్గవ్యాప్తంగా 33,990 మందికి రూ.14.97 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. 28 మందికి కొత్త వితంతు పెన్షన్లు మంజూరు చేసి రూ.1.12 లక్షలు అందించినట్లు వివరాలు వెల్లడించారు. అంతకుముందు నిడదవోలు పట్టణంలోని 13వ వార్డు ఇందిరానగర్ నందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంపిణీలో భాగంగా పెన్షన్లు పొందుతున్న అవ్వాతాతలు, విభిన్నప్రతిభావంతులు ఇలా ప్రతి ఒక్క లబ్ధిదారుడిని ఆప్యాయంగా పలకరించారు. మంచానికే పరిమితమైన రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పెన్షన్ నగదును జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోవాలని, సమయానికి మందులు వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచిస్తూ, "ఎవరూ అధైర్యపడవలసిన అవసరం లేదు.. ప్రభుత్వం మీకు ఎల్లవేళలా అండగా ఉంటుంది" అని ధైర్యాన్ని నింపారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీనే ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందిస్తోంది. 1వ తేదీ సెలవు రోజు వస్తే ఆ ముందు రోజే పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కు పెంచాం. దివ్యాంగులకు రూ.6,000, డయాలసిస్ బాధితులకు రూ.10,000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 చొప్పున అందిస్తున్నాం. పెన్షన్ల పంపిణీ అనేది ఒక నిరంతర ప్రక్రియ" అని వెల్లడించారు. గత ప్రభుత్వం పెన్షన్ల విషయంలో ఎన్నికల సమయంలో ప్రజల్లో అనేక అపోహలు సృష్టించిందని విమర్శించారు. గత ప్రభుత్వం రూ.2000 పెన్షన్ ను రూ.3000 చేయడానికి ఐదేళ్ల సమయం తీసుకుందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.



**స్థానిక సమస్యలపై తక్షణ స్పందన – అభివృద్ధి పనులకు హామీ**

పెన్షన్ల పంపిణీ సమయంలో స్థానిక ప్రజలు పలు సమస్యలను మంత్రి కందుల దుర్గేష్ కి విన్నవించారు.

# పట్టణంలో 95 శాతము పెన్షన్ పంపిణీ.

-మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య

**ధర్మవరం సెప్టెంబర్ 1, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణంలోని 40 వార్డులలో 95 శాతము పెన్షన్ పంపిణీ సజావుగా నిర్వహించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... పట్టణంలో 17,637 మంది పింఛన్దారులు ఉండగా సెప్టెంబర్ ఒకటవ తేదీన 16,673 మందికి సచివాలయ ఉద్యోగులు వారి వారి ఇండ్లకు వెళ్లి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పెన్షన్ తీసుకొని వారికి సెప్టెంబర్ రెండవ తేదీ పూర్తి చేసి నూరు శాతం నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ వార్డ్ మేనేజర్ అశ్వత్ నారాయణ, టీపిఆర్ఓ విజయభాస్కర్ పాల్గొన్నారు.




# అనంతపురం రెడ్ క్రాస్ జిల్లా శాఖకు ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

**విజయవాడ, సెప్టెంబర్ 1 :అనంత జనశక్తి న్యూస్**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సర్వసభ్య సమావేశం (Annual General Meeting) విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన జిల్లాలు, వ్యక్తులు మరియు సంస్థలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గారి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్ ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం జిల్లా శాఖకు ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్ లభించడం విశేష గౌరవంగా నిలిచింది. వీటిలో రెండు మెడల్స్ మెంబర్‌షిప్ కేటగిరీలో, మరో మూడు మెడల్స్ సామాజిక సేవ/కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కేటగిరీలో రెడ్ క్రాస్‌కు విశేష సహకారం అందించిన సంస్థలకు లభించాయి.



**మెంబర్‌షిప్ కేటగిరీ**

మెంబర్‌షిప్ కేటగిరీలో డా. వి.వినోద్ కుమార్, ఐఏఎస్ అప్పటి అనంతపురం జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ మరియు ఐఆర్సిఎస్ అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు, అలాగే వాకా శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఆర్డీఓ, గుంతకల్లు, గవర్నర్ మెడల్‌స్‌కు ఎంపికయ్యారు. ఈరోజు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గవర్నర్ మెడల్‌ను అందుకున్నారు.

**సామాజిక సేవ / CSR కేటగిరీ**

సామాజిక సేవ/CSR కేటగిరీలో అనంతపురం రెడ్ క్రాస్‌కు విశేష సహకారం అందించిన మూడు సంస్థలకు గవర్నర్ మెడల్స్ ప్రదానం చేశారు.M/s Mobis India Module Private Limited సంస్థ IRCS బ్లడ్ సెంటర్‌కు సుమారు రూ.70 లక్షల విలువైన బ్లడ్ బ్యాంక్ పరికరాలను అందించింది. సంస్థ తరపున యాంగ్ యోంగ్‌ద్యూక్, మేనేజింగ్ డైరెక్టర్, Mobis India Module Private Limited, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గవర్నర్ మెడల్‌ను అందుకున్నారు.అదేవిధంగా, Power Grid Corporation of India Limited సంస్థ రెడ్ క్రాస్‌కు సుమారు రూ.55 లక్షల విలువైన సహకారం అందించినందుకు గవర్నర్ మెడల్‌ను అందుకుంది. సంస్థ అందించిన సహకారంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ అఫెరిసిస్ మెషిన్, 25 KW సోలార్ పవర్ సిస్టమ్, ప్లేట్‌లెట్ అజిటేటర్ కమ్ ఇంక్యుబేటర్ వంటి కీలక సదుపాయాలు ఉన్నాయి. సంస్థ తరపున దోమన్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అవార్డును అందుకున్నారు. అలాగే, M/s Saptagiri Camphor Pvt. Ltd. సంస్థ IRCS కార్యకలాపాలకు సుమారు రూ.10 లక్షల విలువైన సహకారం అందించినందుకు గవర్నర్ మెడల్‌ను అందుకుంది. అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ శాఖకు లభించిన ఈ ఐదు ప్రతిష్ఠాత్మక గవర్నర్ మెడల్స్, జిల్లా శాఖ అందిస్తున్న మానవతా సేవలకు మరియు రెడ్ క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడంలో వ్యక్తులు, కార్పొరేట్ సంస్థలు, దాతలు అందిస్తున్న విలువైన సహకారానికి ఒక ముఖ్యమైన గుర్తింపుగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం జిల్లా శాఖ తరపున జిల్లా శాఖ ట్రెజరర్ సుంకర రమేష్, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, బిసాతి భరత్, డాక్టర్ కె. లక్ష్మీనారాయణ, దాసరి భరత్ కుమార్, విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓ.ఆనంద్, ఐఏఎస్ , అనంతపురం జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ మరియు ఐఆర్సిఎస్ అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు, గవర్నర్ మెడల్స్ అందుకున్న అవార్డీస్ అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ క్రాస్ మానవతా సేవలకు వారు అందించిన విలువైన సహకారాన్ని అభినందించారు.

## ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వాలని

# ప్రభుత్వ విప్ కాలవ ప్రతిపాదన

**- ఆమోద ముద్ర వేసిన నీటిపారుదల సలహా మండలి సమావేశం.**

**అనంతపురం సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**




తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిధిలో ఆరుతడి పంటలకు 80 రోజుల పాటు సాగునీరు అందించేందుకు నీటి పారుదల సలహా మండలి సమావేశం ఆమోదముద్ర వేసింది. హెచ్ ఎల్ ఎంసి, జిబిసి పరిధిలో నిర్దేశించిన ఆయకట్టుకు బుధవారం నుండి నీరు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో అనంతపురంలోని రెవెన్యూ భవన్లో మంగళవారం జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశం ఈ మేరకు నిర్ణయించింది. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ... తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిధిలో కనీసం ఆరుతడి పంటలకైనా సాగునీరు ఇస్తారని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని వివరించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను శాస్త్రీయంగా అంచనా వేసి రైతులకు సాధ్యమైనంత మేర సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఇది ఎంతో కొంత ఊరట కలిగిస్తుందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, రైతుల కష్టాన్ని గుర్తించి సాధ్యమైనంత మేరకు ఆరుతడి పంటకు సాగునీరు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది తుంగభద్ర ప్రాజెక్టు నుంచి హెచ్ఎల్‌సీకి సుమారు 16 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. వచ్చే ఏడాది జూలై వరకు జిల్లాలోని తాగునీటి అవసరాలకు నీటిని నిల్వ చేయడం అత్యంత కీలకమన్నారు. ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం సాధ్యం కాదని కర్ణాటక ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం మంత్రులు ప్రభుత్వ స్థాయిలో చర్చించి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంతో కొంత నీటిని విడుదల చేయాలని నిర్ణయించడంతో హెచ్ఎల్‌సీ పరిధిలోని రైతుల్లోనూ ఆరుతడి పంటల సాగుపై ఆశలు పెరిగాయని చెప్పారు. ప్రస్తుతం రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత మేరకు వారికి వెసులుబాటు కల్పించాలన్నారు. తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ప్రణాళిక చేసుకుని, మిగులు నీటిలో కొంత భాగాన్ని 80 రోజుల పాటు హెచ్ఎల్‌సీ ప్రధాన కాలువ పరిధిలోని ఆయకట్టుకు అందించాలని కోరారు. తక్కువ నీటితో సాగు చేసుకునే జొన్న, మొక్కజొన్న లాంటి ఆరుతడి పంటలకు నీరు అందించడం వల్ల రైతులకు కొంతమేర లబ్ధి చేకూరడంతో పాటు పశువులకు అవసరమైన గ్రాసం లభిస్తుందన్నారు.

# యువతకు ఉద్యోగాల పండుగ

**- సెప్టెంబర్ 8న మెగా జాబ్‌మేళా....**
**- 100కు పైగా కంపెనీలతో భారీ ఉపాధి అవకాశాలు....**
**- మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో నిర్వహణ.....**
**- 10వ తరగతి నుంచి పీజీ వరకు అర్హత.....**
**- రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతన అవకాశాలు....**

**ధర్మవరం సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్ :**



ధర్మవరం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 8న ధర్మవరంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. మంగళవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, డీఎస్పీ బీవీ జగన్నాథ్ రాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు.

**ఒకే వేదికపై 100కు పైగా కంపెనీలు....**
ఉద్యోగాల కోసం యువత ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రముఖ జాతీయ, బహుళజాతి కంపెనీలను ధర్మవరానికే తీసుకువచ్చి ఒకే వేదికపై ఉద్యోగ అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా ఉద్దేశమని తెలిపారు. 100కు పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల కోసం ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

**10వ తరగతి నుంచి పీజీ వరకు....**
10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, బీ.ఫార్మసీ, డీ.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఆయా కంపెనీల ఉద్యోగాలను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతన అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

**యువత భవిష్యత్తుకు బంగారు అవకాశం....**
ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా యువత కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు, భవిష్యత్తుకు బలమైన పునాది అని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ధర్మవరం యువతకు స్థానికంగానే మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ జాబ్‌మేళాకు ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. "కంపెనీలే ధర్మవరానికి.. ఉద్యోగాలే యువతకు" అన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**సెప్టెంబర్ 8న ఉదయం 9 గంటలకు.....**
సెప్టెంబర్ 8న ఉదయం 9 గంటలకు ధర్మవరం బత్తలపల్లి రోడ్డులోని సీ ఎన్ బీ కళ్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తదితర పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.
ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగానే నైపుణ్యం పోర్టల్ ద్వారా లేదా పోస్టర్‌లోని క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## మహిళా శక్తికి కలెక్టర్ నాగరాణి నిదర్శనం: సీఎం చంద్రబాబు



**మొగల్తూరు, సెప్టెంబర్ 1:అనంత జనశక్తి న్యూస్**

మహిళలు ఏ బాధ్యతనైనా సమర్థంగా నిర్వర్తించగలరని నిరూపిస్తూ పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆమె పురుష కలెక్టర్‌తో సమానంగా సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు.మొగల్తూరులో నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పనితీరును సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, జిల్లా అభివృద్ధి కోసం ఆమె చూపిస్తున్న చొరవ, అంకితభావం, సమర్థత అభినందనీయమన్నారు. మహిళల్లో అపారమైన శక్తి, ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని, వాటిని సరైన విధంగా వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు ప్రజాసేవలో మరింత గొప్ప ఫలితాలు సాధించవచ్చని చెప్పారు.కలెక్టర్ నాగరాణి పనితీరు మహిళా సాధికారతకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమర్థత, అంకితభావంతో పనిచేసే మహిళలు ఎలాంటి కీలక బాధ్యతనైనా విజయవంతంగా నిర్వహించగలరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా కలెక్టర్ పనితీరును ప్రశంసించడంపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



## ఫిన్లాండ్ విద్యా విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ

**అనంతగిరి, సెప్టెంబర్ 1 (అనంత జన శక్తి న్యూస్):**



ఫిన్లాండ్‌లో ఒత్తిడి లేని, ఆనందదాయక విద్యా విధానంపై ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు అంతర్జాతీయ శిక్షణ పూర్తి చేశారు. హుకుంపేట మండలం మత్స్యాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మోష్య సత్యారావు, అనంతగిరి మండలం చిలకలగడ్డ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు శెట్టి రాంబాబు టుర్కు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'త్రూ జాయ్ అండ్ ప్లే' శిక్షణలో పాల్గొన్నారు.విద్యార్థి కేంద్రిత అభ్యాసనం, అనుభవాత్మక విద్య, సృజనాత్మకత, స్వతంత్ర ఆలోచన, జీవన నైపుణ్యాలు, ఆచరణాత్మక బోధన వంటి అంశాలపై వారు శిక్షణ పొందారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి ఆనందంగా నేర్చుకునేలా చేసే ఫిన్లాండ్ విద్యా విధానాన్ని ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు.శిక్షణ పూర్తి చేసిన సందర్భంగా టుర్కు విశ్వవిద్యాలయం వైస్ డైరెక్టర్ మయా పీతోలా చేతుల మీదుగా సత్యారావు, రాంబాబు సర్టిఫికెట్లు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి భానుమూర్తి రాజు, ఉప విద్యాశాఖ అధికారి ఎస్. చెల్లయ్య, ఎంఈఓలు ఈశ్వరరావు, బాలాజీ, నాగేశ్వరరావు వారిని అభినందించారు.

## మహిళల భద్రతకు శక్తి టీమ్స్ విస్తృత అవగాహన



**అనంతపురం, సెప్టెంబర్ 1 (అనంత జన శక్తి న్యూస్):**

**మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా వ్యాప్తంగా శక్తి టీమ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాలు, పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు పర్యటించారు.మహిళలు, విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగం, అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించే విధానం, 100/112, 1098, 181 హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. అపరిచిత ఫోన్ కాల్స్, నకిలీ బ్యాంకు కాల్స్, ఏటీఎం మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిన్, ఓటీపీ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.మహిళలు, చిన్నారులపై నేరాల నివారణ, మత్తు పదార్థాల దుష్పరిణామాలు, కుటుంబ సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ అందిస్తున్న కౌన్సెలింగ్ సేవలపై కూడా అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, ఆపదలో ఉన్నవారు వెంటనే పోలీసు సేవలను వినియోగించుకోవాలని శక్తి టీమ్స్ సభ్యులు సూచించారు.**

## గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభకు ప్రశంసలు



**అనంతగిరి, సెప్టెంబర్ 1 (అనంత జన శక్తి న్యూస్):**

అనంతగిరి మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల-1 విద్యార్థినులు విద్యా రంగంలో ప్రతిభ చాటారు. ఇటీవల నిర్వహించిన విద్యా ప్రతిభా పోటీలు, ఉన్నత విద్యా ఎంపికల్లో పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు అత్యున్నత స్థాయికి ఎంపికయ్యారు.జన్ని యమున నవ్యశ్రీ, సోమేల శైలు, సోమేల శ్రావ్యలు ప్రత్యేక శిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణతో ఈ ఘనత సాధించారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, సరైన వసతులు, ప్రత్యేక శిక్షణ అందిస్తే వారు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణించగలరని ఈ విజయంతో నిరూపితమైంది.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వంగపండు అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. విద్యార్థినుల విజయంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ



**- పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి**

**అగళి సెప్టెంబర్ 01,అనంత జనశక్తి న్యూస్:**

అగళి మండలంలోని హళ్ళికేర గ్రామంలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లను నేరుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. 'ఎన్టీఆర్ భరోసా' ద్వారా వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలకు ఆర్థిక కొండంత అండ లభిస్తోందని తెలిపారు. లబ్ధిదారుల ముంగిటకే వెళ్ళి పింఛన్లు అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఈ పథకాల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మొదటి సెమిస్టర్ ఫలితాల లో విద్యార్థులు విజయ దుందుభి.



**-శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరి .**

**ధర్మవరం సెప్టెంబర్ 1, అనంత జనశక్తి న్యూస్:**

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మొదటి సెమిస్టర్ ఫలితాలనందు శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ టాపర్లుగా నిలవటం జరిగింది అని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల తరపున బిసియే నందు బి తస్లీం 95 శాతము, బీకాం నందు జీవన 94 శాతము మార్కులతో యూనివర్సిటీ టాపర్లుగా నిలవటం జరిగిందన్నారు. అలాగే బిసియే నందు సునీత 94 శాతము, శ్రీలత 94 శాతము, స్వాతి 93 శాతము, జి చంద్రిక 92 శాతము, రిజ్వాన 92 శాతము, షాహీన 91 శాతము, జ్యోతి 90 శాతము, ప్రియాంక 90 శాతము, లక్ష్మిహరిక 90 శతము, బీకాం నందు సోనియా 93 శాతము,జ్ఞానేశ్వరి 93 శాతము, నవ్య శ్రీ 93 శాతము, భవిష్య 92 శాతము, శ్రీ 90 శాతము శిరీషా బాయి 90 శాతము, జి వైష్ణవి 90 శతము, విష్ణు వర్ధన్ 90 శాతము, భరత్ కుమార్ రెడ్డి 89 శాతము కైవసం చేసుకుందన్నారు.అలాగే బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ నందు జి రిషిత 92 శాతము, హరిత 91 శాతము, రాజు 85 శాతము మార్కులను సాధించారని వారు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు 82 మంది 80 శాతము మార్కులకు పైగా సాధించారని 133 మంది విద్యార్థులు డిస్టింక్షన్ నందు పాస్ అయ్యారని తెలుపుటకు ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు , అధ్యాపక బృందానికి కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ అభినందన శుభాకాంక్షలను తెలియజేశారు.

## అగళి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో తెదేపా నాయకులు

**అగళి సెప్టెంబర్ 01,అనంత జనశక్తి న్యూస్:**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అగళి మండల వ్యాప్తంగా సజావుగా తెదేపా నాయకుల చేతుల మీదుగా అధికారులు సెప్టెంబర్ నెల పెన్షన్లు పంపిణి చేసినారు. ఈ సందర్భంగా అగళిలో మండల జడ్పీటీసీ వీ.ఉమేష్, కోడిపల్లిలో సీనియర్ తెదేపా నాయకుడు కె.యన్. రమేష్, అగళిలో వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.ఆర్.శివరాములు, దోక్కలపల్లిలో మండల అధ్యక్షులు కుమారస్వామి, ఇనగలూరులో క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, మధూడి గొల్లహట్టిలో వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ శిల్ప కేంచప్ప, మధూడిలో తెదేపా అధ్యక్షుడు తిప్పేస్వామి, ఇరిగేపల్లి గొల్లహట్టి మరియు మధుడి గొల్లహట్టి గ్రామంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి డి.విశ్వనాధ్ యాదవ్ ఇరిగేపల్లి పంచాయతీ అధ్యక్షులు కె.ఈ. రెడ్డి, ఆయాయ పంచాయితీలలో తెదేపా నాయకులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి కార్యక్రమములో పాల్గొని వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు డబ్బు కళాకారులకు తదితర పెన్షన్ లబ్దిదారులకు మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి చేశారు.



# మండల ఎమ్మార్పీఎస్ తాత్కాలిక కమిటీ




**నల్లచెరువు సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు స్థానిక గీతా మందిరంలో మంగళవారం నాడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం నల్లచెరువు మండలంలో జిల్లా ఇంచార్జ్ బాయికాట్ బెనర్జీ మాదిగ మరియు శ్రీ సత్య సాయి జిల్లా మాజీ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు మాదిగ కదిరి నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాథ్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ ఎఫ్ తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు,ఈ కమిటీలో మండల అధ్యక్షులుగా తిరుపాలు ఉపాధ్యక్షులుగా ఉమాశంకర్ లను తాత్కాలికంగా ఎన్నుకున్నారు,జిల్లా ఇన్చార్జ్ బాయ్ కాట్ బెనర్జీ మాదిగ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వికలాంగులు మరియు వితంతు పెన్షన్ ఎస్సీ వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ అన్న మాదిగ విజయాల గురించి మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం గ్రామాల్లో కమిటీ బలోపేతం చేయాలని తెలిపారు శ్రీ సత్యసాయి మాజీ జిల్లా అధ్యక్షులు పలక ఆంజనేయులు యువతకు యువ నాయకత్వం కావాలని ఎమ్మార్పీఎస్ గ్రామాల యువతను బలోపేతం చేయాలని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేరాలపైన అప్రమత్తంగా ఉండండి...ఎస్సై గోపాల్ కృష్ణ



**అమడగూరు, సెప్టెంబర్ 1 ( అనంత జనశక్తి న్యూస్ )**

అమడగూరు మండలంలో, మలకవారిపల్లి తండా లో,ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,నేరాలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడాలని ఎస్సై గోపాల్ కృష్ణ సూచించారు. సోమవారం, మండలంలోని మలకవారిపల్లి తండాలో గ్రామంలో ఎస్సై గోపాలకృష్ణ సిబ్బందితో కలిసి పర్యటించి,ప్రజలకు అవగాహన కోసం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఎస్సై మాట్లాడుతూ మహిళల భద్రత,మాదక ద్రవ్యాలు వలన కలిగే దుష్ప్రభావాలు,సైబర్ నేరాలు,సేఫ్టీ,రోడ్డు సేఫ్టీ, శక్తియాప్,డిజిటల్ మోసాలు,మహిళలు,బాలికలపై జరిగే నేరాలు,డ్రంక్ అండ్ డ్రైవ్,బాల్య వివాహాలు, ఫోక్సో కేసులు,గుడ్ టచ్-బ్యాడ్ టచ్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు,ఈవ్ టీజింగ్లపై ప్రజలకు వివరించారు.గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని,ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లకూడదని.తమ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు.కొత్త వ్యక్తులు ఎవరైనా మీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.సమాజంలో ప్రస్తుతం ఆన్లైన్ మోసాలు అధికమయ్యాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీలు,ఖాతాల వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు.చదువుకోవాల్సిన వయస్సులో విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు.ఈవ్ టీజింగుకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.ద్విచక్ర వాహనాలు నడిపేవారు లైసెన్స్ కలిగి ఉండి హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,గ్రామస్తులు

ఈ కార్యక్రమంలో,ఎస్సై గోపాల్ కృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# న్యాయవాదుల సంక్షేమానికి ‘ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్’

**- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి: అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి**

**కర్నూలు, సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా *“ఏపీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్”*ను ఏర్పాటు చేశారు. ప్రముఖ న్యాయవాది సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కే. సాగర్, సంయుక్త కార్యదర్శిగా అజిత్, కోశాధికారిగా కే. శ్రీదేవి ఎన్నికయ్యారు.న్యాయవాదుల సంక్షేమ పథకాలు, ఆరోగ్య భద్రత, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు జూనియర్ న్యాయవాదులకు న్యాయ శిక్షణ, సీనియర్ న్యాయవాదుల మార్గదర్శకత్వం అందించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. న్యాయవాదులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, వారి వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు అసోసియేషన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా నిరుపేదలు, సామాన్య ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి గౌరవాన్ని కాపాడుతూ, న్యాయవాదులందరి సమైక్యతతో అసోసియేషన్‌ను బలోపేతం చేస్తామని అన్నారు.కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్లలో ఒకటని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని అన్నారు. నూతన అసోసియేషన్ ఏర్పాటుపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# పేరూరు ప్రాజెక్టుకు వెలుగులు, భద్రత కోసం సీసీ కెమెరాలు

**- 35లక్షలతో ఏర్పాటు చేసిన వాటిని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**
**- రామగిరి - పేరూరు డబల్ రోడ్డు బ్రిడ్జి పనులను పరిశీలించిన సునీత**
**- పనులు వేగవంతంగా చేయాలని ఆదేశం**
**- పేరూరు ప్రాజెక్టు నిర్వహణ, సంరక్షణపై ప్రత్యేకంగా ఫోకస్**

**రాప్తాడు సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

పేరూరు ప్రాజెక్టు నూతన శోభ సంతకరించుకుంది. గత ఐదేళ్లుగా నిర్వహణ, సంరక్షణ లేక అధ్వాన్న స్థితిలో ఉన్న ఆనకట్ట మరియు స్పిల్ వే పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. రూ.35లక్షల రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధులతో ఎలక్ట్రికల్ లైట్స్, ఫ్లడ్ లైట్స్, సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయించారు. మంగళవారం సాయంత్రం వీటిని స్థానిక టీడీపీ నాయకులు, అధికారుల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టుపై నడుస్తూ విద్యుత్ లైట్లను, సీసీ కెమెరాలను పరిశీలించారు. అంతకుమందు రామగిరి మండలం దుబ్బార్లపల్లి సమీపంలో 50.075 కిలోమీటర్ వద్ద జరుగుతున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు.



ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పనులు ఎంత వరకు వచ్చాయి, నాణ్యత ఎలా ఉందన్న విషయాలను ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించాలని 804కోట్లతో పనులు మొదలు పెట్టామన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అడుగు కూడా పని చేయలేదన్నారు. భూమిలిచ్చిన రైతులకు కూడా పరిహారం ఇవ్వలేదన్నారు. భూగర్భజలాలు కూడా పూర్తిగా అడుగంటాయన్నారు. వారు చేసిన పాపం వలనే ఇంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అయితే మళ్లీ అధికారంలోకి రాగానే పనులు పునః ప్రారంభించామన్నారు. పేరూరు ప్రాజెక్టుపై గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు, యంత్రాలను కొందరు ధ్వంసం చేస్తున్నారన్నారు. దీనిని అదుపు చేయాలని గతంలో చాలా ప్రయత్నాలు చేశామన్నారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. అందుకే వీటిని కంట్రోల్ చేయడానికి ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్యాంపై ఎవరైనా ఇష్టమొచ్చిన చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. అంతే కాకుండా పేరూరు జలాశయాన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేలా ఇవాళ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్ లో ప్రాజెక్టుకు నీరందించడమే కాకుండా దీనిని పర్యాటక ప్రాంతంగా మారుస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు...

# కూటమి ధర్మం పాటిస్తూనే క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతమే లక్ష్యం



**- మంత్రి కందుల దుర్గేష్**

**నిడదవోలు సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా, ప్రత్యేకించి నిడదవోలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించడమే కాకుండా, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి దుర్గేష్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.మంగళవారం నిడదవోలు క్యాంప్ కార్యాలయంలో పార్టీశ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..విజయవాడలో ఇటీవల జరిగిన సమావేశంలో 2021 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున నిలబడిన అభ్యర్థులను ఘనంగా సత్కరించి అభినందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నాడు వైసీపీ ప్రలోభాలకు, డబ్బు ఆశకు లొంగకుండా ఓడినా, గెలిచినా జనసేన జెండానే పట్టుకుని నిలబడిన నిబద్ధత కలిగిన నాయకులు మనకున్నారని గుర్తుచేశారు.ఆనాటి నిబద్ధతే నేడు కూటమి ప్రభుత్వంలో జనసేనకు కొండంత బలాన్ని ఇచ్చిందన్నారు. సెప్టెంబర్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉందని, కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వివరించారు.ఆ తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని వెల్లడించారు. గతంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ పోటీ చేశామని, ప్రస్తుతం రాష్ట్రంలో కూటమికి అనుకూల వాతావరణం ఉందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన బలంగా ఉన్న స్థానాల్లో గతం కంటే ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి విజయభేరి మోగిస్తామని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 2న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గం.లకు నిడదవోలు పట్టణం నుండి కోట సత్తెమ్మ ఆలయానికి వెళ్లే సమయంలో హృదయాలయ వృద్ధుల శరణాలయం సందర్శించి అక్కడ వృద్ధులకు వితరణ చేయనున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. అనంతరం ప్రస్తుతం కేరళలో చికిత్స పొందుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని కోరుకుంటూ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. ఆ తర్వాత తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవాలయం నుండి బైక్ ర్యాలీ ప్రారంభమై రోటరీ క్లబ్ కు చేరుకుంటుందన్నారు. అనంతరం ఉదయం 11 గం.లకు ఆన్‌లైన్ వేదికగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్వయంగా యువజన విభాగాన్ని ఆవిష్కరించి, పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేస్తారని వెల్లడించారు. రోటరీ క్లబ్ హాల్ లో రక్తదాన శిబిరం, ఆ తర్వాత లంచ్ ఉంటుందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జరుగుతున్నప్పటికీ, నిడదవోలులో సేవా కార్యక్రమాలు, పూజలు, బైక్ ర్యాలీలతో ప్రత్యేకతను చాటుకోవాలని శ్రేణులకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు..గ్రామ, మండల, వార్డు స్థాయిల నుండి వీరమహిళలు, జనసైనికులు, పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి రేపటి కార్యక్రమాలను విజయవంతం చేసి నిడదవోలులో జనసేన బలమేంటో చాటిచెప్పాలని కోరారు.

# ఎల్‌నినోతో నీటి సంక్షోభం.. తాగునీటికే తొలి ప్రాధాన్యం

**- వరి, మిర్చి సాగు వద్దు.. ఆరుతడి పంటలకే నీరు: పయ్యావుల**
**- నవంబర్ 10 వరకు నీటి వినియోగం.. 80 రోజుల ప్రణాళిక**

**అనంతపురం, సెప్టెంబర్ 1 (అనంత జన శక్తి న్యూస్):**

**ఎల్‌నినో ప్రభావంతో వర్షా భావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 2027 జూలై 31 వరకు సరిపడా తాగునీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి అవసరమయ్యే వరి, మిర్చి పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందిస్తామని స్పష్టం చేశారు. హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీ కింద ఆరుతడి పంటలకు మంగళవారం రాత్రి నుంచే నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని**



**సూచించారు. రైతులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా నచ్చజెప్పే విధానంలో ముందుకు వెళ్లాలని తెలిపారు.తుంగభద్ర డ్యాం నుంచి నవంబర్ 10 వరకు నీరు వచ్చేలా 80 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి నీటి విడుదలను మరో 10–15 రోజులు పొడిగించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. తుంగభద్ర డ్యాంలోని 33 గేట్లను ఒకేసారి మార్చడం దేశంలోనే రికార్డుగా నిలిచిందన్నారు.జిల్లాలో తాగునీటి అవసరాలకు 6.3 టీఎంసీల నీటిని కేటాయించాలని ప్రతిపాదించినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. జూలైలో సాధారణం కంటే 55 శాతం, ఆగస్టులో 70 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని వివరించారు. జిల్లాలో నీటి కొరత తీవ్రంగా ఉన్న 12 మండలాల్లో ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యామ్నాయ నీటి వసతులపై దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జలవనరులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.**

# ఉత్తరాంధ్ర సాగునీటి ముఖచిత్రంపై సువర్ణాక్షర సంతకం పోలవరం ఎడమ కాలువ

**- సుమారు నాలుగు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించిన అపర భగీరథుడు నారా చంద్రబాబు**
**- పోలవరం ఎడమ కాలువ జల హారతి కార్యక్రమం నిర్వహణపై అధికారులు నాయకులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష**

**అనకాపల్లి సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

ఉత్తరాంధ్ర సాగునీటి ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మక పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో పాయకరావుపేటలో జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్, కొలుసు పార్థసారథి తో కలిసి అధికారులు, పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జలహారతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరానున్న నేపథ్యంలో జన సమీకరణ, సభా ఏర్పాట్లు, తాగునీరు, ఆహారం సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సభకు హాజరయ్యే ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, ఆహారం వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం పి.ఎల్.పురం వద్ద ఏర్పాటు చేస్తున్న సభా వేదికను మంత్రులు పరిశీలించారు. వేదిక, ర్యాంప్, గ్యాలరీలు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని తెలిపారు. అపర భగీరథుడిలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమించి పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తి చేయించి ప్రారంభోత్సవం నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఉత్తరాంధ్ర రైతాంగానికి కొత్త ఆశలు కల్పిస్తుందని, ఈ ప్రాజెక్టు ప్రాంత వ్యవసాయ రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు.

కాలువ వద్ద మంత్రుల సంబరాలు

**పోలవరం ఎడమ ప్రధాన కాలువ పూర్తయిన సందర్భంగా పాయకరావుపేటలో మంత్రులు, నాయకులు, కార్యకర్తలు సంబరాలు**



**నిర్వహించారు. కాలువ వద్ద టపాసులు కాల్చి, స్కై లాంతర్లు వెలిగించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలను తీర్చే దిశగా పోలవరం ఎడమ కాలువ కీలక మైలురాయిగా నిలుస్తుంది. కాలువ పనులను పూర్తి చేసి ఉత్తరాంధ్రకు జలభరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ బెందాళం అశోక్, బడేటి రాధాకృష్ణ, కూన రవికుమార్, వరుపుల సత్యప్రభ , అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.**

# ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు

**అనకాపల్లి సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**



ఉత్తరాంధ్ర ప్రజలు గత 20-30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించే మహత్తర కార్యక్రమం రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం ఎల్ఎంసీ పనుల్లో అనేక క్లిష్టమైన సమస్యలను అధిగమించి ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేసిందన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఏలేరు, పంపా, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను దాటుకుంటూ కాలువను నిర్మించామని మంత్రి తెలిపారు. అదేవిధంగా 11 ప్రాంతాల్లో నేషనల్ హైవేలను క్రాస్ చేస్తూ పనులు పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవ వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న భూసేకరణ సమస్యను పరిష్కరించి, అత్యంత క్లిష్టమైన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల లోతు వరకు కొండను కట్ చేసి కాలువ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు.వేలాది నిర్మాణాలు, భూసేకరణ సమస్యలు, ఇతర సాంకేతిక అవాంతరాలను అధిగమించి రెండేళ్లలోనే ఎల్ఎంసీ ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

**ఐదేళ్లలో ఎల్ఎంసీపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం**

2019-2024 మధ్య ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఒక్క తట్ట మట్టి పని కూడా జరగలేదని, ఒక్క రూపాయి పని కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే క్లిష్టమైన పనులను పూర్తి చేసి, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడం ప్రారంభించిందన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎల్ఎంసీ జీవనాడి**

పోలవరం ఎల్ఎంసీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి జీవనాడిగా మారనుందని మంత్రి అన్నారు. ఎల్ఎంసీ ద్వారా విశాఖపట్నం నగరానికి తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు, భవిష్యత్‌లో రానున్న పరిశ్రమలకు అవసరమైన నీటి భద్రత కల్పించవచ్చన్నారు. నీరు, పరిశ్రమలు, పెట్టుబడులతో ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి శకం ప్రారంభం కానుందని తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, నేడు ఉత్తరాంధ్రకే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వచ్చే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

**పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా గోదావరి జలాలు**

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. అయితే పోలవరం పూర్తయ్యే వరకు ఉత్తరాంధ్ర ప్రజలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా ఎల్ఎంసీకి నీటిని అందిస్తున్నామని చెప్పారు.నాడు పురుషోత్తపట్నం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారు, అధికారంలోకి వస్తే పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి విమర్శించారు. అయితే నేడు అదే పురుషోత్తపట్నం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందుతున్నాయని తెలిపారు.

**పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణానికి రూ.29 కోట్లు**

పోలవరం ఎల్ఎంసీ పనుల్లో భాగంగా పుష్కర లిఫ్ట్‌కు సంబంధించిన పంపులను తొలగించాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రూ.29 కోట్లతో పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణ పనులు చేపట్టామని, పనులు పూర్తయితే అదనంగా 700 నుంచి 1,500 క్యూసెక్కుల వరకు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

**ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ప్రాధాన్యత**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రాబోయే రెండేళ్లలో ఆయా ప్రాజెక్టులపై రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీకి అవసరమైన అనుమతులను కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. రాబోయే 3-4 నెలల్లో నేరడి బ్యారేజీ పనులను పట్టాలెక్కించి ఉత్తరాంధ్ర చిరకాల కలను సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**కృష్ణా జలాలు ప్రకాశానికి.. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు**

వెనుకబడిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలను తరలించామని, ఇప్పుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కృష్ణా, గోదావరి జలాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా మళ్లిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపర భగీరథుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు.టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఉత్తరాంధ్ర గుండెకాయ లాంటిదని, ఈ ప్రాంత అభివృద్ధికి నీరు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.ఉత్తరాంధ్రకు గోదావరి జలాల రాకతో సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# చేనేతలకు ఆప్కో చెల్లింపులు

**అమరావతి సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 201924 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కోనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది.

**24 నెలల్లో రూ.24.51 కోట్ల చెల్లింపులు**

చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెల కానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**రూ.కోటీ 3 లక్షల లివరీ చెల్లింపులు**

మంత్రి సవిత ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖాధికారులు రాష్ట్రంలోని వివిధ చేనేత సహకార సంఘాలకు రూ.1,03,38,678లను మంగళవారం చెల్లించారు. వివిధ శాఖలు, గురుకులాల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి ఈ చెల్లింపులు చేశారు. 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆ చెల్లింపులను జమ చేశారు. త్వరలో మిగిలిన బకాయిలను కూడా చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**చెల్లింపులపై మంత్రి సవిత ప్రత్యేక దృష్టి**

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశంలో చేనేత సహకార సంఘాలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రత్యేక దృష్టి సారించారు. చేనేత సహకార సంఘాల ఆర్థిక బలోపేతంలో భాగంగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోళ్లు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేటి తరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఏయే వస్త్రాలు కావాలో ఆయా సంఘాలకు ఆప్కో ద్వారా ఆర్డర్లు అందజేస్తున్నారు. అదే సమయంలో ఆయా సంఘాల నేతలతోనూ సమావేశమై వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు తయారు చేయాలని సూచిస్తున్నారు. శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాకుండా వాటికి తక్షణ చెల్లింపులు చేసేలా ఆప్కో అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆప్కో చరిత్రలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత బకాయిల్లేకుండా మంత్రి సవిత తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై అసత్య ప్రచారం చేయొద్దు

**కరీంనగర్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**



ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు.

'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు.

వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# ఎన్ని అడ్డంకులొచ్చినా నా ఆశయాన్ని ఆపలేరు



(మొదటి పేజీ తరువాయి)

వైకాపా నేతలకు ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. అందుకే ఏకగ్రీవాలు జరిగితే వదిలిపెట్టనంటూ గొడ్డలి పార్టీ నాయకుడు ఆ పార్టీ నేతలకు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏకగ్రీవాలు చేస్తే మీరేం చేస్తారని వైకాపా నేతలను చంద్రబాబు ప్రశ్నించారు. ''గ్రామాల్లో కావాల్సింది గొడవలు కాదు.. ఐకమత్యం. మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆయారాం.. గయారాం సంస్కృతికి చెక్ పెట్టేందుకే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నాం. స్థానిక ఎన్నికలు జరిగితే చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో వైకాపా నేతలు 'సర్' పేరిట హైకోర్టుకు వెళ్లారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నుంచి నిధులు నిలిచిపోతాయి'' అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రినై 31 ఏళ్లు**

31 ఏళ్ల క్రితం ఇదే రోజు తొలిసారి ముఖ్యమంత్రినయ్యానని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ''48 ఏళ్ల నా రాజకీయ జీవితంలో మొగల్తూరుకు ఎన్నోసార్లు వచ్చా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టింది ఇవాళే. అంతకుముందు ఎన్నో రాజకీయ మార్పులు చూశా. నేను ఎన్ని జన్మలెత్తి సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను'' అని సీఎం చంద్రబాబు ప్రజలనుద్దేశించి అన్నారు.

**మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారు..**

మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

నా ఆశయాన్ని ఆపలేరు..

కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు.

**ఆ రోజులు రాబోతున్నాయ్..**

డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చన్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్ వన్ ఆంత్రప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**చరిత్రను మార్చబోతున్నాం...**

అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేపు (బుధవారం) గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు.

**డిప్యూటీ సీఎం ఆలోచన ప్రజల గురించే..**

మూడేళ్లుగా కరెంటు ఛార్జీలు పెంచలేదని, తగ్గించామని సీఎం అన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు 32 వేల కోట్ల రూపాయల మేర ఛార్జీలు పెంచారని చెప్పారు. లక్షా 50 వేల కోట్లు విద్యుత్ నిమిత్తం అప్పులు చేశారని వివరించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. యూనిట్ రూపాయిన్నరకే ఆక్వాకు కరెంటు ఇస్తూ.. రూ.1200 కోట్లు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కేరళంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనునిత్యం ప్రజల గురించే ఆలోచిస్తున్నారని తెలిపారు.

**గొడ్డలి పార్టీకి వణుకు...**

గొడ్డలి పార్టీకి వణుకు పుట్టిందని.. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయితే ఊరుకోమని అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏకగ్రీవం చేస్తే వారేం చేస్తారని ప్రశ్నించారు. ఆయారాం, గయారాంలకు చెక్ పెట్టేందుకే మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలను తీసుకువచ్చామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తే, మళ్లీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని.. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో సర్ పేరుతో మళ్లీ కోర్టుకు వెళ్లారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే చాలదని.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉండాలని అన్నారు. సమాజంలో కలుషితం పోవాలని తెలిపారు. జనవరి నుంచి సంజీవని పథకాన్ని తీసుకొస్తున్నామని.. అప్పుడు డాక్టర్లే ప్రజల దగ్గరకు వస్తారన్నారు.



# సుప్రీంకోర్టు జడ్జినంటూ సుకేష్ బెదిరింపులు

**- 8 ఏళ్ల జైలుశిక్ష వేసిన న్యాయస్థానం**
**- కేసులో బెయిల్ పొందేందుకు..**

**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

సాధారణంగా బెయిల్ పొందడానికి ఏవేవో కారణాలు చెబుతుంటారు. ఎలాగోలా బయటకు వచ్చేందుకు సాధ్యమైనన్ని పనులు చేస్తుంటారు చాలా మంది. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఓ వ్యక్తి మాత్రం బెయిల్ కోసం.. ఏకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అవతారమెత్తాడు. అంతేనా ఓ ప్రత్యేక జడ్జిని బెదిరించి ఘోర మోసానికి పాల్పడ్డాడు. అయితే ఈ కేసులో నిందితుడైన సుకేష్ చంద్రశేఖర్‌కు ఢిల్లీ కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఈ తీవ్ర నేరానికి గాను అతనికి ఎనిమిది ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఢిల్లీ చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ హర్షితా మిశ్రా సంచలన తీర్పును ఇచ్చారు. నిందితుడు చేసిన తప్పు.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను, విచారణ ప్రక్రియను దెబ్బతీసే కుట్రగా అభివర్ణించారు. పోలీస్ కస్టడీలోనే ప్లాన్.. కానిస్టేబుల్ ఫోన్‌తో డ్రామా వినీతి కేసులో పోలీస్ కస్టడీలో ఉన్న సుకేష్ చంద్రశేఖర్ 2017 ఏప్రిల్ 28వ తేదీన.. కానిస్టేబుల్ మంజీత్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దక్కించుకున్నాడు. దాని ద్వారా అప్పట్లో అవినీతి నిరోధక చట్టం కేసులను విచారిస్తున్న స్పెషల్ జడ్జ్ పూనం చౌదరి ల్యాండ్‌లైన్, మొబైల్ నంబర్లకు ఫోన్ చేశాడు. మొదట సుప్రీంకోర్టు జడ్జి వద్ద పనిచేసే ప్రైవేట్ కార్యదర్శినని పరిచయం చేసుకుని, ఆ తర్వాత స్వయంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తినేనని బురిడీ కొట్టించాడు. తన కేసులో వెంటనే బెయిల్ మంజూరు చేయాలని, లేకపోతే ఉద్యోగ పరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జడ్జీని బెదిరింపులకు గురిచేశాడు.

విడివిడిగా శిక్షలు.. ఒకదాని తర్వాత ఒకటి అమలు!

కానీ జడ్జీ మాత్రం ఈ పని చేసింది ఎవరో తెలుసుకున్నారు. ముఖ్యంగా అది కానిస్టేబుల్ నెంబర్ అని తెలుసుకుని.. నిందితుడిపై మరికొన్ని కేసులు నమోదు చేశారు. ఆపై విచారణ జరిపి.. సుకేష్ చంద్రశేఖరే నిందితుడిని గుర్తించారు. ముఖ్యంగా ఆగస్టు 20వ తేదీన సుకేష్‌ను ఐపీసీ సెక్షన్లు 170 (ప్రభుత్వ ఉద్యోగిలా నటించడం), 189 (ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించడం), 507 (ఆకాశ రామన్న సమాచారంతో బెదిరింపులు) కింద దోషిగా నిర్ధారించింది. ఐపీసీ 170 కింద రెండేళ్లు, 189 కింద రెండేళ్లు, 507 కింద నాలుగు ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో కాకుండా.. ఒకదాని తర్వాత ఒకటి అమలయ్యేలా ఆదేశించారు. దీంతో సుకేష్ మొత్తం 8 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

న్యాయవ్యవస్థపై దాడి.. డీప్‌ఫేక్స్ యుగంలో హెచ్చరిక

నేరానికి పాల్పడిన విధానం చట్టపాలనపై నేరుగా జరిపిన దాడి అని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌ఫేక్ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కాలంలో ఈ రకమైన నేరాలు న్యాయవ్యవస్థకు సవాలుగా మారుతున్నాయని జడ్జి హెచ్చరించారు. సుకేష్ విచారణ ముగిసే సమయంలో కోర్టుపైనే నిందలు వేస్తూ విచారణను ఆలస్యం చేసేందుకు యత్నించాడని, తన చర్యల పట్ల ఎలాంటి పశ్చాత్తాపం చూపలేదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.



# ఈ సినిమాతో అందరికీ 'గుడ్ టైం'



బలమైన కథతో... ఎంతో నిజాయతీగా రూపొందించిన సినిమానే మా 'గుడ్ టైం' అన్నారు నిఖిల్ గాజుల. పేరుకి తగ్గట్టుగానే ఈ సినిమాతో మా అందరికీ మంచి సమయం మొదలైందన్నారు. ఆయన కథానాయకుడిగా, చాణక్య జిల్లా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. రమేశ్ జిల్లా నిర్మాత. అన్యక్త నలాని, హృతిక్ శెట్టి, ధనరాజ్, సునీతా మనోహర్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వంశీ నందిపాటి, శశికిరణ్ తిక్క, నందు, ఐశ్వర్య, రమణారెడ్డి, లక్ష్మణ్ గుంటూరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా, మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నాపైన నమ్మకంతో ఇందులో అవకాశమిచ్చారు దర్శకనిర్మాతలు. చిత్ర పరిశ్రమలో నా ప్రయాణం మొదలై ఆరేళ్లయింది. ఈ సినిమాతోనే మా అందరికీ గుడ్ టైం మొదలైంది. అందరినీ అలరించే ఓ మంచి సినిమా ఇది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రత్యేకమైన భావోద్వేగాలతో రూపొందిన సినిమా ఇద"న్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత దినేశ్ కార్తీక్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

# అనుపమ్ ఖేర్ 555వ చిత్రం

నాలుగు దశాబ్దాలుగా తన నటనా జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నానని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్. దశాబ్దాలుగా చిత్రసీమలో రాణిస్తున్న ఆయన... తన 555వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్‌ను పంచుకున్నారు అనుపమ్. "కొన్ని విషయాలను కొంతకాలం పాటు మనసులోనే భద్రంగా దాచుకోవడం మంచిది. ఎందుకంటే సరైన సమయంలో వాటిని వెల్లడించడంలో ఉండే ఆనందమే వేరు. కాబట్టి ప్రస్తుతానికి నేను చెప్పేది ఒక్కటే. నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 555వ చిత్రాన్ని ప్రకటిస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలు త్వరలోనే ప్రకటిస్తాను" అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



## అల్లరి నరేశ్ 'సుడిగాడు2'

# చేయకపోవడానికి కారణమిదా?



తెలుగు సినీ ఇండస్ట్రీలో కామెడీతో మెప్పించగల అతికొద్ది మంది హీరోల్లో అల్లరి నరేశ్ ఒకరు. ఒకప్పుడు ఆయన నుంచి సినిమా వస్తుందంటే, నవ్వులు, హిట్ మినిమం గ్యారెంటీ అనుకునేవారు. కానీ, పరిస్థితి మారుతూ వచ్చింది. ప్రేక్షకుల అభిరుచులూ మారాయి. వెకిలి కామెడీని నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఏకి పారేస్తున్నారు. ఈ క్రమంలో సినిమాల్లో కామెడీ సన్నివేశాలపై వస్తున్న విమర్శలపై నటుడు అల్లరి నరేశ్ స్పందించారు. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో నరేశ్ నటించిన 'రంభ ఊర్వశి మేనక' సెప్టెంబరు 4న విడుదల కానుంది. తాజాగా ఈ మూవీకి సెన్సార్ యూ/ఏ ఇచ్చింది. ఈ క్రమంలో చిత్ర ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు.

**'కితకితలు' ఇప్పుడు చేయలేం!**

"ప్రతి 10 సంవత్సరాలకు ఇండస్ట్రీ ట్రెండ్ మారుతోంది. మనం కూడా అప్‌డేట్ కావాలి. ఇవాళ కామెడీ చేయడం చాలా సున్నితమైన అంశమైపోయింది. ఏదైనా ఫేమస్ డైలాగ్ పెడుతుంటే, ఫలానా వాళ్లను అన్నారని, మనోభావాలు దెబ్బతిన్నాయని అంటున్నారు. 'సుడిగాడు2' చేయాలని చాలా మంది అడుగుతున్నారు. నాకు చాలా టెన్షన్ వస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా ఫ్యాన్ వార్స్ మొదలైపోతాయి. ఒకప్పుడు 'కితకితలు' చేశాం. అదే ఇప్పుడు చేస్తే 'ఒక మహిళను బాడీ షేమింగ్ చేస్తారా' అని విమర్శలు వస్తాయి. కలర్, క్యాస్ట్ ఇలా దేని గురించి మాట్లాడినా అది ఇప్పుడు వైరలైపోతుంది."

**ఆర్గానిక్ కామెడీ కావాలి..**

"ఒకప్పుడు ఒక కమెడియన్‌ను మరో కమెడియన్ కొడితే నవ్వేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 'అమానవీయం కదా!' అంటారు. అదే సమయంలో ప్రేక్షకులు అసభ్య కామెడీని అస్సలు ఇష్టపడటం లేదు. మీమ్స్ రిఫరెన్స్‌లు ఉంటే అక్కడక్కడా ఆస్వాదిస్తున్నారు. ఆర్గానిక్ కామెడీ కావాలి. పుస్తకాల్లో చదవనిది, వాట్సాప్‌లో పంపనిది మనం చెప్పాలనుకుంటున్నారు. అలాంటిది ప్రయత్నిస్తే తప్పకుండా ప్రోత్సహిస్తున్నారు" అని నరేశ్ అభిప్రాయపడ్డారు. 'రంభ ఊర్వశి మేనక' సినిమాలోనూ అల్లరి నరేశ్ పలువురు నటులను ఇమిటేట్ చేశారు. ట్రైలర్‌లో ఆయా సన్నివేశాలు నవ్వులు పూయించాయి. మరోవైపు ఇటీల విడుదలైన వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' మూవీలో సత్య పలువురు నటులను ఇమిటేట్ చేయడం సామాజిక మాధ్యమాల వేదికగా పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో అల్లరి నరేశ్ స్పందించడం గమనార్హం.

## 'ఇరుముడి' నుంచి కార్తీకమాసం సాంగ్ వచ్చేసింది

రవితేజ (Ravi Teja) కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇరుముడి'. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న ఈ మూవీ నుంచి మరో సాంగ్ విడుదలైంది. 'కార్తీకమాసం' అంటూ సాగే లిరికల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. అయ్యప్ప స్వామి దీక్ష విశిష్టతను తెలియజేస్తూ సాగే ఈ పాట థియేటర్‌లోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరాలు సమకూర్చిన ఈ పాటను దర్శకుడు శివ నిర్వాణ రాయడం గమనార్హం.




# బిగ్‌ట్విస్ట్.. ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ!

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం.

"హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు" అని ఫ్రాంచైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపో యిన ప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకు నేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది.



# పుజారా బెస్ట్ టీమ్ ఇదే.. ధోని, రోహిత్‌కు దక్కని చోటు



భారత మాజీ బ్యాటర్ ఛెతేశ్వర్ పుజారా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన బెస్ట్ టీమ్‌ను ఎంచుకోవాలని పుజారాను కోరారు. అయితే, వారందరూ తన మాజీ సహచరులే అయి ఉండాలనే షరతు విధించారు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఐదుగురు ఆటగాళ్లు.. రిటైర్ అయిన ఆరుగురిని పుజారా ఎంచుకున్నాడు. మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మలకు చోటు కల్పించకపోవడం గమనార్హం. అలాగే కెరీర్‌లో ఎంతోకాలం కలిసి ఆడిన అజింక్య రహానేను కూడా ఛెతేశ్వర్ తన అత్యుత్తమ జట్టులోకి తీసుకోలేదు.

పుజారా తన అత్యుత్తమ జట్టులో మాజీ బ్యాటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌లను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానాన్ని తనకే ఇచ్చుకున్నాడు. నాలుగో స్థానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను తీసుకున్నాడు. ఐదో స్థానంలో విరాట్ కోహ్లీని ఎంచుకున్న పుజారా.. ఆ తర్వాతి ప్లేస్‌ను మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఇచ్చాడు. వికెట్‌కీపర్‌గా ధోనికి బదులు రిషభ్ పంత్ వైపే మొగ్గుచూపాడు. చివరి నాలుగు స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను తీసుకున్నాడు. మిగిలిన రెండు స్థానాల్లో పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమిలకు అవకాశం కల్పించాడు. 12వ ఆటగాడిగా మాజీ పేసర్ ఇషాంత్ శర్మను తీసుకున్న పుజారా.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యకు ఛాన్స్ ఇచ్చాడు.

# తిలక్ అజేయ శతకం



దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.

దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314